Follow: @ANNTELUGU

ANN తెలుగు

26-05-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 173 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## కోల్‌కతాపై సన్‌రైజర్స్ గ్రాండ్ విక్టరీ

హెన్రిచ్ క్లాసెన్ విధ్వంసం

37 బంతుల్లో సెంచరీ

వివరాలు 8లో

**టాప్ న్యూస్**

### మాకు కేసీఆరే బాస్



- కవిత పార్టీ పెడితే ఎంత వాల్యూ ఉంటుందో చూడాలే
- ఆమె పార్టీ పెట్టడం కేవలం ఊహాగానాలే
- మాజీ మంత్రి గంగుల కమలాకర్

02


### కవిత లేఖ బీజేపీకి మేలు చేసేలా ఉంది



- కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి
- ఆ లేఖతో బీఆర్ఎస్‌కు నష్టం, బీజేపీకి లాభం
- కేసీఆర్ వల్లే కేటీఆర్, హరీశ్, కవితకు గుర్తింపు
- కవిత తన కొమ్మను తానే నరుక్కుంటోంది


02

### షర్మిల, కవితలను కాంగ్రెస్ పావులుగా వాడుకుంటోంది



- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శ
- ఆస్తుల పంపకాల్లోనే వివాదాలున్నాయని ఆరోపణ

02



## బీ కేర్ ఫుల్

కరోనా కేసులు పెరుగుతున్నాయ్

రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్

వివరాలు 3లో



## ప్రభాకర్ రావుకు రెడ్ కార్నర్ షాక్!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
- నోటీసు అమలు ప్రక్రియను ప్రారంభించిన అమెరికా ప్రభుత్వం
- అమెరికా నుంచి డిపోర్ట్ చేసేందుకు చర్యలు
- భారత్‌కు పంపించేందుకు యూఎస్ హోం ఏజెన్సీ ప్రయత్నాలు


వివరాలు 3లో



## నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- జపాన్‌ను అధిగమించి ముందుకు నాలుగు ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ
- ప్రకటించిన నీతి ఆయోగ్


వివరాలు 3లో



## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

- ఈసెట్ ఫలితాల్లో 93.87 శాతం ఉత్తీర్ణత
- మెటలార్జికల్ ఇంజినీరింగ్, బీఎస్సీ మ్యాథ్స్, ఫార్మసీలో 100 శాతం ఉత్తీర్ణత నమోదు

వివరాలు 4లో



# హరీష్‌ను ఫిక్స్ చేస్తారా?

**ఈటల, హరీష్ విచారణ తేదీల్లో మార్పులు**

### ఆర్థిక శాఖకు ప్రాజెక్టుకు ఏం సంబంధం అన్న ఈటల

### జూన్ 6న ఈటల.. 9న హరీష్ విచారణ... కీలక నేతలకు అందిన నోటీసులు

మహా : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌లకు కాళేశ్వరం ప్రాజెక్టు పై న్యాయ విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు ఇచ్చిన విషయ తెలిసిందే. తాజాగా.. కమిషన్ నోటీసులు వారికి చేరాయి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు పనిచేశారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పనిచేశారు. కమిషన్ ముందు హాజరు కావలసిన ఈటల, హరీశ్ రావు తేదీలలో మార్పు చేశారు. ముందు నిర్ణయించిన ప్రకారం జూన్ 6వ తేదీన హరీశ్ రావు, 9వ తేదీన ఈటలకు రావాలని ఆదేశించగా తాజాగా జూన్ 6వ తేదీన ఈటల రాజేందర్, 9వ తేదీన హరీశ్ రావు విచారణకు హాజరవ్వాలని కమిషన్ పేర్కొంది. కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు రావాలని కమిషన్ నోటీసుల్లో పేర్కొంది. అయితే, కమిషన్ విచారణకు కేసీఆర్, హరీశ్ రావులు హాజరవుతారా..? అనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన తరువాత ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి హరీశ్ రావు వెళ్లారు. కేసీఆర్ తో తాజా పరిస్థితులపై ఆయన చర్చించినట్లు తెలిసింది. అయితే, తాజా సమాచారం ప్రకారం.. కమిషన్ విచారణకు సంబంధించి న్యాయ నిపుణులతో కేసీఆర్ చర్చిస్తున్నట్లు తెలిసింది. వారి సూచనల మేరకు విచారణకు హాజరుపై తుది నిర్ణయం తీసుకుంటారని సమాచారం. హరీశ్ రావు కమిషన్ ముందు విచారణకు హాజరు కావాలని డిసైడ్ అయినట్లు తెలిసింది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరికీ కమిషన్ నోటీసులు జారీ చేసింది.

# ఫైనల్ లిస్ట్ రెడీ?

## ఢిల్లీలో సీఎం, పీసీసీ చీఫ్ బిజీ బిజీ

ఇవాళ అగ్రనేతలతో కీలక సమావేశం

కార్యవర్గం, క్యాబినెట్ విస్తరణపై డిస్కషన్

ఈ నెల చివర్లో హైకమాండ్ నుంచి ప్రకటన!



మహా: ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగుతుంది. నేడు కొందరు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి కలిసే అవకాశాలున్నాయి. ఇక ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకూ కేబినెట్ విస్తరణ జరగలేదు. రేవంత్ రెడ్డి కేబినెట్ లో ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ లు ఢిల్లీలోనే ఉన్నారు. సోమవారం ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ లను కలిసే అవకాశం ఉన్నది. పీసీసీ కార్యవర్గం, క్యాబినెట్ విస్తరణపై చర్చించే ఛాన్స్ ఉన్నట్లు పార్టీ నేతలు చెప్తున్నారు.

మిగతా 2లో



## ఢిల్లీలో వర్ష బీభత్సం

- కూలిన పోలీసుస్టేషన్, ఎస్ఐ దుర్మరణం
- నీట మునిగిన కార్లు, బస్సులు
- విమానాల రాకపోకలపై ప్రభావం
- దాదాపు 180కు పైగా విమానాలపై ప్రభావం
- మరో 49 విమానాల దారి మళ్లింపు

వివరాలు 2లో

## మేం చింతిస్తున్నాం

మిల్లా మ్యాగీ ఆరోపణలపై విచారణ జరగాలి.. ట్విట్టర్ లో మాజీ మంత్రి కేటీఆర్

03

# దాడికి ప్రతి దాడి తప్పదు

**ఉగ్రవాదం పట్ల నివాళులర్పించే విధానానికి స్వస్తి**


### ఇంట్లోకి చొరబడి కొడతాం

సనత్ నగర్ లో మోదీ 'మన్ కీ బాత్' వీక్షణలో కేంద్రమంత్రి

ప్రతీ ఒక్కరూ ప్రధాని చెప్పిన విషయాలను ఆచరించాలని పిలుపు

ఐక్యతతో కూడిన ఆరోగ్యవంతమైన సమాజ రూపకల్పన అత్యవసరం

తిరంగా యాత్రలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలి.. వంకర తోకను కత్తిరించేస్తాం





మహా : ఉగ్రదాడులపై దేశ ప్రజలు ప్రాణాలు కోల్పోతే గులాబీ పూలతో, క్యాండిల్స్ వెలిగించి నివాళులర్పించే విధానానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇక స్వస్తి పలికిందని, దాడి చేస్తే ప్రతి దాడి తప్పదని ఒక్కరిని చంపితే వందమందిని చంపుతామనే విధానాన్ని వారి (పాక్-ఉగ్రవాదులు) కళ్లకు కట్టినట్లు చూపించామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీబాత్ 122వ ఎపిసోడ్‌ను ఆదివారం సనత్ నగర్ నియోజకవర్గంలో ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని పిలుపునిచ్చారు. ఇందులో ప్రధాని మాట్లాడిన ముఖ్యమైన స్వచ్ఛత, యోగా, డయాబెటీస్ లాంటి విషయాలను ఆచరణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' ప్రజలను జాగృతం చేస్తుందని ఐక్యంగా నిలబెడుతుందని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందిస్తుందని చెప్పారు.

మిగతా 2లో

# ప్లాన్ ప్రకారమే కుట్ర

## బనకచర్ల ప్రాజెక్టు రేవంత్ అడ్డుకోరా?





- గోదావరి జలాలు ఏపీ తరలించుకుపోయే కుట్ర
- నీతి ఆయోగ్ సమావేశంలో ఎందుకు ప్రశ్నించలే
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు బాధ్యత లేదా?
- అనుమతి లేకుండానే ఏపీ ముందుకు వెళ్తుంది
- ఇంత దుర్మార్గంగా రెండు పార్టీలు ఎట్ల వ్యవహరిస్తున్నాయి
- బీజేపీ, కాంగ్రెస్ పై హరీశ్ రావు విమర్శలు

02

ఉపాధి, ఆదాయం వచ్చే పరిశ్రమలు

# రాష్ట్రం దాటకుండా చూడండి

**ప్రతి శనివారం ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సమావేశం నిర్వహిస్తాం**

హుండయ్ రీసెర్చ్ డెవలప్మెంట్ సెంటర్ కు సబ్ కమిటీ ఆమోదం

ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్మెంట్స్ ప్రమోషన్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మహా: రాష్ట్ర యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రజా భవన్లో డిప్యూటీ సీఎం అధ్యక్షతన ఇండస్ట్రియల్ ప్రమోషన్ సబ్ కమిటీ సమావేశం జరగా కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు హాజరయ్యారు.

మిగతా 2లో

# ప్లాన్ ప్రకారమే కుట్ర

## బనకచర్ల ప్రాజెక్టు రేవంత్ అడ్డుకోరా?

గోదావరి జలాలు ఏపీ తరలించుకుపోయే కుట్ర

నీతి ఆయోగ్ సమావేశంలో ఎందుకు ప్రశ్నించలే

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు బాధ్యత లేదా?

అనుమతి లేకుండానే ఏపీ ముందుకు వెళ్తుంది

ఇంత దుర్మార్గంగా రెండు పార్టీలు ఎట్ల వ్యవహరిస్తున్నాయి

బీజేపీ, కాంగ్రెస్ పై హరీశ్ రావు విమర్శలు



**మహా:** రాష్ట్ర నీటి అవసరాలు కాపాడటంలో ఈ ప్రభుత్వం విఫలమైంది.. గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.200 టీఎంసీల గోదావరి జలాలు ఏపీ తరలించుకుపోయే కుట్ర జరుగుతుంది. తెలంగాణకు ఇంత జరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు. గోదావరి - బనకచర్లకు ఒక్క అనుమతి లేకుండానే ఏపీ ముందుకు వెళ్తుంది. కేంద్రం జుట్టు తన చేతిలో ఉందని చంద్రబాబు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన జలదోపిడీ.. కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైంది. నదీ పరివాహక ప్రాంతాల్లోని అన్ని రాష్ట్రాలు ఒప్పుకోవాలి. తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులకు చంద్రబాబు మోకాలు అడ్డుపెట్టారు. తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని కేంద్రానికి లేఖలు రాశారు. తెలంగాణ ప్రాజెక్టులు నిలిపివేయాలని ఏపీకి 20కి పైగా లేఖలు రాసింది. పాలమూరు, భక్తరామదాసు, డిండిపై చంద్రబాబు లేఖలు రాశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

**బండి సంజయ్‌కు బాధ్యత లేదా..?**

తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వట్లేదని సీఎం అసెంబ్లీలోనే చెప్పారు. నీతి ఆయోగ్ సమావేశం బహిష్కరిస్తామని రేవంత్ రెడ్డి గతంలో చెప్పారు. నిన్న అందరి కంటే ముందే వెళ్లి సమావేశంలో కూర్చున్నారు. ఏ అనుమతులు లేని గోదావరి - బనకచర్లను ఎందుకు అడ్డుకోవట్లేదు. నీతి ఆయోగ్ సమావేశంలో రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదు. అక్రమంగా నీళ్లు తీసుకెళ్తుంటే ఆపే ప్రయత్నం చేయడం లేదు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు బాధ్యత లేదా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీజేపీ తెలంగాణకు ద్రోహం చేస్తుంది. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతు ఇవ్వరు. ఏపీ ప్రాజెక్టులకు అనుమతులు లేకున్నా నిధుల కనవర్షం కురిపిస్తున్నారు. ఇదెక్కడి నీతి..? కిషన్ రెడ్డి చొరవచూపాలి. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. అక్రమ ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తాం. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ నీతిని ఎండగడుతాం అని హరీశ్‌రావు హెచ్చరించారు.మరో విషయంలో తెలంగాణకు బీజేపీ ద్రోహం చేస్తుంది.

**సుప్రీం కూడా తల దూర్చదు..**

పోలవరం ద్వారా 80 టీఎంసీల నీటిని కృష్ణా పరివాహక ప్రాంతానికి మళ్లించినట్లు అయితే ఆ 80 టీఎంసీలు ఎగువన ఉన్న రాష్ట్రాలకు చెందుతాయని బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ఇచ్చింది. ఇందులో సుప్రీం కూడా తల దూర్చదు. తెలంగాణకు 45 టీఎంసీలు, కర్ణాటకుకు 25, మహారాష్ట్రకు 14 టీఎంసీలు అని చెప్పింది. సీడబ్ల్యూసీకి కర్ణాటక దరఖాస్తు చేసింది.. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు 25 టీఎంసీలు కేటాయించింది. మహారాష్ట్రకు చెందిన 14 టీఎంసీలు ఇచ్చింది. అదే పద్ధతుల్లో 45 టీఎంసీలు మాకు దక్కాలని, పాలమూరు ఎత్తిపోతలకు కేటాయించండి అంటే డీపీఆర్ వాసప్ పంపుతారు. ఇది బీజేపీకి తెలంగాణ పట్ల ఉన్న వివక్షకు నిదర్శనం. ఇంత దుర్మార్గంగా ఎట్ల వ్యవహరిస్తారు. అదే బచావత్ ఇంకో మాట చెప్పింది. 90 టీఎంసీల కంటే ఎక్కువ తీసుకుపోయినా.. ఇదే నిష్పత్తిలో ఎగువన ఉన్న రాష్ట్రాలకు కృష్ణా నదిలో నీటి వాటాలు కేటాయించాలని చెప్పింది. ఈ లెక్కన తెలంగాణకు 112 టీఎంసీలు రావాలి. అంటే మొత్తం 157 టీఎంసీలు తెలంగాణకు కలిపి ఇవ్వాలి. దీంతో కల్వకుర్తి, డిండికి నికర జలాలు కేటాయించుకోవచ్చు అని హరీశ్‌రావు తెలిపారు.

# ఢిల్లీలో వర్ష బీభత్సం

## కూలిన పోలీసు స్టేషన్, ఎస్ఐ దుర్మరణం

నీట మునిగిన కార్లు, బస్సులు.. విమానాల రాకపోకలపై ప్రభావం

దాదాపు 180కు పైగా విమానాలపై ప్రభావం.. మరో 49 విమానాల దారి మళ్లింపు



**మహా :** భారీ వర్షాలు ఢిల్లీని ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన కూడళ్లు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. అనేక ప్రాంతాల్లో రహదారులు నీటమునగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ధౌలాకువాన్, సుబ్రోతో పార్క్, నానక్ పురాలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దిల్లీ కంటోన్మెంట్ లోని లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షం పడటంతో ఓ బస్సు, కారు వరద నీటిలో చిక్కుకుపోయాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి అక్బర్ రోడ్డు సమీపంలో చెట్లు నేలకొరిగాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ప్రతికూల వాతవారణం వల్ల దిల్లీకి పలు విమానాల రాకపోకలకు ఆలస్యం అవుతోంది. దాదాపు 180కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, మరి కొన్నింటిని మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది ఎయిర్‌పోర్టు. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవాలని సలహా ఇచ్చింది. అటు ఎయిరిండియా, ఇండిగో కూడా ప్రయాణికులను అప్రమత్తం చేశాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని చెప్పాయి. అంతకుముందు శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఢిల్లీ నగరాన్ని విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన అండర్‌పాస్ జలమయమైంది. ఫలితంగా డజన్ల కొద్దీ కార్లు, బస్సులు నీటమునిగాయి. ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేసింది.

**కూలిన పోలీసుస్టేషన్, ఎస్ఐ దుర్మరణం**

భారీ వర్షానికి ఘజియాబాద్ లోని పోలీస్ స్టేషన్ కూలిపోయింది. శిథిలాల కింద చిక్కుకుని ఎస్సై దుర్మరణం పాలయ్యారు. ఏసీపీ అంకుర్ విహార్ ఆఫీస్ లో వీరేంద్ర మిశ్రా (58) ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి భారీ వర్షం, పెనుగాలులకు స్టేషన్ పైకప్పు కుప్పకూలింది. వర్షం కారణంగా స్టేషన్ లోనే ఉండిపోయిన మిశ్రా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. శిథిలాలు మీదపడడంతో తీవ్ర గాయాలపాలై మిశ్రా మరణించారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. ఢిల్లీలో శనివారం రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5.30 వరకు 81.2 మిల్లీ మీటర్ల భారీ వర్షం కురిసింది. దీంతో మోతీ బాగ్, మింటో రోడ్, దీన్ దయాల్ ఉపాధ్యాయ్ మార్గ్, ఢిల్లీ కంటోన్మెంట్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.


**కేరళలో రెడ్ అలర్ట్**

మరోవైపు రుతుపవనాల రాకతో కేరళలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రోడ్లన్నీ వరద నీటితో జలమయమవగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే కాసర్‌గోడ్, కన్నూర్, కోజికోడ్, వయనాడ్, మలప్పురం జిల్లాల్లో అధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. వచ్చే నాలుగు రోజులు కేరళలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లు వదిలి రావద్దని సూచించింది. మహారాష్ట్ర, రాజస్థాన్‌లో కూడా వర్షాలు కురుస్తున్నాయి.

# షర్మిల, కవితలను కాంగ్రెస్ పావులుగా వాడుకుంటోంది

## బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శ

ఆస్తుల పంపకాల్లోనే వివాదాలున్నాయని ఆరోపణ



**మహా :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాలపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా కుటుంబాల పెద్దలు అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా ఆస్తులు సంపాదించుకున్నారని, ఇప్పుడు అధికారం కోల్పోవడంతో ఆస్తులు, పదవుల పంపకాల్లో తేడాలు రావడంతో కుటుంబాల్లో వివాదాలు తలెత్తాయని ఆయన ఆరోపించారు. ఈ వివాదాల కారణంగానే ఆ కుటుంబ సభ్యులు ఇప్పుడు రోడ్డున పడుతున్నారని విమర్శించారు. ఒకప్పుడు అన్నల కోసం, వదినల కోసం బాణాలుగా మారిన చెల్లెళ్లు, ఇప్పుడు అధికారం, ఆస్తుల కోసం అన్నల మీదే బాణాలు గురిపెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజల అవసరాల కంటే తమ కుటుంబ అవసరాలు, వారసత్వమే ముఖ్యమన్నట్లుగా ఈ రెండు కుటుంబాలు తెలుగు రాష్ట్రాల్లో వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. నిన్న వైఎస్ఆర్ కుటుంబం, నేడు కేసీఆర్ కుటుంబం వీధుల్లో పడి రచ్చకెక్కుతున్నాయని వ్యాఖ్యానించారు.

ఈ కుటుంబ కలహాల వెనుక కాంగ్రెస్ పార్టీ ప్రధాన పాత్ర పోషిస్తోందని లక్ష్మణ్ ఆరోపించారు. అన్నల మీదకు చెల్లెళ్లను ఉసిగొల్పడంలో కాంగ్రెస్ పార్టీది కీలక పాత్ర అని స్పష్టమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోగానే, వైఎస్ షర్మిలను ఆయనపైకి ఉసిగొల్పి, ఇప్పుడు పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టారన్నారు. అదేవిధంగా, తెలంగాణలో కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితను కూడా కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం పావుగా వాడుకుంటోందన్న వాదన బలపడుతోందని లక్ష్మణ్ విశ్లేషించారు. తండ్రులు సంపాదించిన అక్రమాస్తులు, అధికారం కోల్పోయిన తర్వాత రాజకీయ పదవుల పంపకాల్లో వచ్చిన తేడాలే ఈ కుటుంబ వివాదాలకు ప్రధాన కారణమని ఆయన పునరుద్ఘాటించారు.



# మాకు కేసీఆరే బాస్

- కవిత పార్టీ పెడితే ఎంత వాల్యూ ఉంటుందో చూడాలే
- ఆమె పార్టీ పెట్టడం కేవలం ఊహాగానాలే
- మాజీ మంత్రి గంగుల కమలాకర్

**మహా:** ఎమ్మెల్సీ కవిత లేఖపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుమార్తెగా కవిత పార్టీ పెడితే, ఎంత వాల్యూ ఉంటుందో చూడాలన్నారు. కవిత పార్టీ పెట్టడం కేవలం ఊహాగానాలే అని తేల్చేశారు. అంతర్గత విషయాలు బహిరంగంగా మాట్లాడొద్దు అన్న కేటీఆర్ మాటలతో ఏకీభవిస్తున్నానన్నారు.మాకు కేసీఆరే బాస్ తాము కేసీఆర్ ఆదేశాలనుసారం నడిచే కార్యకర్తలం అన్నారు. కవిత పార్టీ పెడితే అప్పుడు మాట్లాడుతామని, తమ బాస్ ఎప్పటికీ కేసీఆరే అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. పార్టీ అధినేతకు ఎవరైనా లేఖలు రాయొచ్చని, కానీ బహిరంగ లేఖలు రాయడం కరెక్ట్ కాదన్న కేటీఆర్ వ్యాఖ్యలతో ఏకీభవిస్తానని చెప్పారు. తాము ఎప్పటికీ కేసీఆర్ సూచించిన బాటలో నడుస్తామని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చన్నారు. కేసీఆర్ కూతురిగా కవిత పెట్టే పార్టీకి ఎంత వాల్యూ ఉంటుందో చూడాలని అన్నారు.

# దాడికి ప్రతి దాడి తప్పదు



(మొదటిపేజీ తరువాయి)

ఇందులోని ప్రధాని చేసిన సూచనలు, సలహాలు ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఆచరించాలని కిషన్ రెడ్డి కోరారు.

**ఆపరేషన్ సింధూర్ తో గట్టి సందేశం..**

లుంబినీపార్క్, గోకుల్ చాట్, సాయిబాబా టెంపుల్, దిల్ సుక్ నగర్ పేలుళ్లు, ముంబాయి ట్రైన్ దాడులు, పార్లమెంట్ పై దాడి ఇలా అనేక దాడులతో గత 46 ఏళ్లుగా పాక్ ఉగ్రవాదాన్ని భారత్ పై ఎగదోస్తూ అనేకమంది ప్రాణాలను బలితీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడుల సమయంలో నివాళులర్పించి సరిపెట్టుకునేవారమన్నారు. కానీ మోదీ ప్రభుత్వం వచ్చాక పఠాన్ కోట్ -సర్జికల్ స్ట్రైక్, పూల్వామా-ఎయిర్‌స్ట్రైక్, పహెల్గామ్ -ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని పెంచి పోషించే దేశాన్ని కూడా మట్టి కలిపేస్తామనే గట్టి సందేశాన్ని ఇచ్చారన్నారు. ఇలాంటి సమయాల్లోనే పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు, వర్ణాలు అనేవి పక్కన పెట్టి దేశమంతా ఐక్యతగా నిలవాల్సిన అవసరముందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ తో 9 ఉగ్రస్థావరాలను పాక్ భూభాగంలోకి చొరబడి మరీ ప్రతీకారం తీర్చుకున్నామన్నారు. ఇందులో భారత సైనికుల పాత్ర కీలకమన్నారు. ఈ ఆపరేషన్ లో విశాఖకు చెందిన ఒక సైనికుడు కూడా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇటువంటి సమయంలో నిర్వహిస్తున్న తిరంగ యాత్రలు, ర్యాలీల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొని దేశ ఐక్యతను చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను కూడా అంబర్ పేట్, జూబ్లీహిల్స్, నాంపల్లి, ముషీరాబాద్ లలో ర్యాలీలు నిర్వహించానని చెప్పారు.

**దాడికి సమాధానం ప్రతీదాడి**


పహెల్గామ్ దాడి అతిక్రూరమైనదన్నారు. పిల్లల ముందు తండ్రిని, భార్యముందు భర్తను చంపడమే గాకుండా హిందువులను పక్కన తీసుకొని మరీ చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీకి చెప్పుకోండని హెచ్చరికలు కూడా జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఆగడాలకు భారత్ ఆపరేషన్ సిందూర్ ద్వారా గట్టి సమాధానం ఇచ్చిందన్నారు. ఇకపై భారత్ లో జరిగే ప్రతీ దాడికి సమాధానం ఇచ్చి తీరుతామన్నారు. ఉగ్రదాడులపై పాక్ 'కుక్క తోక వంకర' అన్నట్లే ప్రవర్తిస్తే ఆ తోకనే కత్తిరించేస్తామని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

# తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

- ఈసెట్ ఫలితాల్లో 93.87 శాతం ఉత్తీర్ణత
- మెటలార్జికల్ ఇంజనీరింగ్, బీఎస్సీ మ్యాథ్స్, ఫార్మసీలో 100 శాతం ఉత్తీర్ణత నమోదు

**మహా :** తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో టీజీ ఈసెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలక్రిష్ణ రెడ్డి విడుదల చేశారు. ఈసెట్ ఫలితాల్లో 93.87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మెకానికల్ ఇంజినీరింగ్‌లో పోతుగంటి కార్తిక్, సివిల్ ఇంజినీరింగ్‌లో గోల్కొండ నిఖిల్ కౌశిక్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో శ్రీకాంత్, ఫార్మసీలో ఐలి చందన, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కట్లే రేవతి, బీఎస్సీ మ్యాథ్స్‌లో సంతోష్ కుమార్, మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో తోట సుబ్రహ్మణ్యం, కెమికల్ ఇంజినీరింగ్‌లో లెంక తేజ సాయి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో కాసుల శ్రావణి, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో రాపర్తి చందన, మైనింగ్ ఇంజినీరింగ్‌లో కుర్మ అక్షయ మొదటి ర్యాంకు సాధించారు. కాగా, టీజీ ఈసెట్ పరీక్ష మే 12న జరగగా... 18,998 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈసెట్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ (మ్యాథమేటిక్స్) అభ్యర్థులకు 202526 విద్యా సంవత్సరంలో బీటెక్, బీఈ, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా రెండో ఏడాదిలో ప్రవేశాలు కల్పించనున్నారు.

# ఉపాధి, ఆదాయం వచ్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూడండి



(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్, ఇప్పటికే చేసుకున్న ఎంవోయుల అమలులో ప్రగతి, కొత్త యూనిట్ల స్థాపనకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఒక పరిశ్రమ స్థాపిస్తే అందుకు అనుబంధంగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్న ప్రతిపాదనలపై దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇకనుంచి ప్రతి శనివారం ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ సమావేశాన్ని నిర్వహిద్దామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. ఒక పరిశ్రమ ఏర్పాటుతో అనేక అనుబంధ పరిశ్రమలు రావడం తద్వారా రాష్ట్ర యువతకు వేళల్లో ఉద్యోగాలు, రాష్ట్ర ఖజానాకు పెద్ద సంఖ్యలో ఆదాయం సమకూరే వ్యూహాత్మక ప్రాధాన్యతను అధికారులు దృష్టిలో పెట్టుకొని ఆ రకమైన ప్రతిపాదనలపై కసరత్తు చేయాలని అధికారులకు సబ్ కమిటీ సూచించింది. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హుండాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ స్థాపనకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. 675 ఎకరాల్లో 8528 కోట్ల పెట్టుబడితో ఈ కంపెనీ రాష్ట్రానికి రావడం గొప్ప విజయం గా సబ్ కమిటీ అభిప్రాయపడింది. ఈ రీసర్చ్ సెంటర్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుతో కొత్తగా 4276 మంది రాష్ట్ర యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు సమావేశంలో వివరించారు. రీసెర్చ్ సెంటర్ లో ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్, పైలట్ లైన్, ప్రోటో టైపింగ్ ప్రధాన వ్యవస్థలు ఉంటాయని కంపెనీ ప్రతినిధులు సబ్ కమిటీకి వివరించారు. ప్రస్తుతం ప్రారంభించబోతున్న పరిశ్రమలు రాబోయే కొద్ది సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉపాధి, ఆదాయాన్ని రాష్ట్రానికి సమకూరుస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్, సీఈఓ సెక్రటరీ అజిత్ రెడ్డి, md tgiic విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ మల్సూర్, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫైనల్ లిస్ట్ రెడీ?



(మొదటిపేజీ తరువాయి)

గత కొన్ని రోజులుగా పెండింగ్ లో ఉన్న పీసీసీ కార్యవర్గం జాబితా ఈ మీటింగ్ లో ఫైనల్ కానున్నది. ఇప్పటికే జంబో టీమ్ ను ఎంపిక చేస్తున్నట్లు పీసీసీ స్పష్టం చేసింది. దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇక క్యాబినెట్ బెర్త్ కోసం చాలా మంది లీడర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. క్యాస్ట్, డిస్ట్రిక్ట్ తో పాటు పొలిటికల్ ఈక్వేషన్ బేస్ చేసుకొని బెర్త్ లను కన్ఫామ్ చేయనున్నది. ఈ మేరకు సీఎం, పీసీసీ అభిప్రాయాలను కూడా ఈ భేటీలోనే తీసుకోనున్నారు. జూన్ ఫస్ట్ వీక్ లో క్యాబినెట్ విస్తరణ ఉంటుందని పీసీసీ గతంలో ప్రకటించారు. ఆ ప్రాసెస్ తుది దశకు చేరడంతో ఆశావహులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# కవిత లేఖ బీజేపీకి మేలు చేసేలా ఉంది

## కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

- ఆ లేఖతో బీఆర్ఎస్‌కు నష్టం, బీజేపీకి లాభం
- కేసీఆర్ వల్లే కేటీఆర్, హరీశ్, కవితకు గుర్తింపు
- కవిత తన కొమ్మను తానే నరుక్కుంటోంది



**మహా :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల రాసిన లేఖ తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ లేఖపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కవిత చర్యలు సొంత పార్టీకి నష్టం చేకూర్చి, బీజేపీకి మేలు చేసేలా ఉన్నాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారం కేసీఆర్ కుటుంబంలోని అంతర్గత కలహాలను సూచిస్తోందని వ్యాఖ్యానించారు. మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి, కవిత లేఖ వల్ల కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచో బలంగా ఉందని, భవిష్యత్తులో కూడా అదే పటిష్టతతో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ మొదటి స్థానంలో, బీఆర్ఎస్ రెండో స్థానంలో, బీజేపీ మూడో స్థానంలో ఉన్నాయని విశ్లేషించారు. కమ్యూనిస్టు పార్టీలు ఉన్నప్పటికీ, అధికారంలోకి వచ్చేంత బలం వాటికి లేదని అభిప్రాయపడ్డారు. "కవిత లేఖ ద్వారా నష్టం జరుగుతుందనేది వారి కుటుంబ వ్యక్తిగత అంశం. ఈ లేఖతో కేసీఆర్ కుటుంబంలో విభేదాలున్నాయనే భావన ఆ పార్టీ శ్రేణుల్లో కలుగుతుంది. దీనివల్ల బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ వైపు చూసే ప్రమాదం ఉంది" అని జగ్గారెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ ఉంటేనే కేటీఆర్, హరీశ్ రావు, కవిత నాయకులుగా గుర్తింపు పొందారని, కేసీఆర్ వల్లే బీఆర్ఎస్‌కు ఉనికి ఉందని ఆయన గుర్తుచేశారు. కవిత తీరును తప్పుబడుతూ, "తండ్రిని దేవుడు అంటూనే, ఆయన్ను రాజకీయంగా సమాధి చేసేలా కవిత వ్యవహారం ఉంది. ఇది తన కొమ్మను తానే నరుక్కున్నట్లుగా ఉంది. కవిత డిప్రెషన్‌లో ఉండి ఈ లేఖ విడుదల చేశారేమో అనిపిస్తోంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఉనికిని దెబ్బతీస్తూ, బీజేపీని పెంచి పోషించేలా ఆ పార్టీ నేతల వ్యవహారశైలి ఉందని విమర్శించారు. లేఖలు, లీకులు కేవలం మీడియా వార్తలకే పరిమితమవుతాయని, అవి పార్టీ మనుగడను దెబ్బతీస్తాయన్న నిజాన్ని గ్రహించాలని హితవు పలికారు. తెలంగాణలో నాయకత్వం లేని బీజేపీకి బీఆర్ఎస్ నేతలే పరోక్షంగా బలాన్ని చేకూరుస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. "కేసీఆర్ లోతైన ఆలోచనాపరుడు. బహుశా తన పిల్లలు దారి తప్పుతున్నారని ఆయన భావిస్తున్నట్లుంది. తండ్రి గురించి కవితకు పూర్తి అవగాహన లేకపోవడం దురదృష్టకరం. సాధారణంగా కుటుంబానికి కొడుకే వారసుడవుతాడు, కొడుకు లేని పక్షంలో కూతురు వారసురాలు అవుతుంది" అని వ్యాఖ్యానించారు. కవిత కేసీఆర్ కుమార్తె కావడం వల్లే మీడియాలో అంత ప్రాధాన్యత లభిస్తోందని, ఆమె రాష్ట్ర రాజకీయాలను ఏదో తిప్పేస్తుందనుకోవడం భ్రమ అని అన్నారు. కవిత రాస్తున్న లేఖలు తమ రాజకీయ శత్రువైన బీజేపీకి ఉపయోగపడతాయన్నదే తమ ఆందోళన అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ వైపు ఆకర్షించేందుకు తగిన వ్యూహాన్ని పీసీసీ, ముఖ్యమంత్రితో చర్చించి అమలు చేస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# మేం చింతిస్తున్నాం

## మిల్లా మ్యాగీ ఆరోపణలపై విచారణ జరగాలి ట్విట్టర్ లో మాజీ మంత్రి కేటీఆర్



**మహా :** హైదరాబాద్ లో జరుగుతున్న మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ అకస్మాత్తుగా వైదొలగడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఆమె నిర్వాహకులపై చేసిన ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. మాగీ 'ది సన్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. తమను వేశ్యల్లా చూశారని, ధనవంతులైన స్పాన్సర్లను అలరించడానికి, వారితో విందులలో పాల్గొనడానికి తమపై ఒత్తిడి తీసుకువచ్చారని ఆరోపించారు. ఆరుగురు పురుషులున్న టేబుల్‌కు ఇద్దరు అమ్మాయిలను కేటాయించి వారిని 'ఎంటర్‌టైన్' చేయాలని నిర్వాహకులు కోరారని ఆమె పేర్కొన్నారు. ఈ అనుభవం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. 'బ్యూటీ విత్ ఏ పర్పస్' అనే పోటీ స్ఫూర్తికి ఇది విరుద్ధమని అన్నారు. భారీ మేకప్, బాల్ గౌనులు నిత్యం ధరించాలని ఒత్తిడి చేశారని కూడా ఆమె వెల్లడించారు. మిల్లా మాగీ మొదట వ్యక్తిగత కారణాలతో వైదొలిగినట్లు ప్రకటించినప్పటికీ.. తర్వాత తన అసలు కారణాలను వెల్లడించారు. ఈ ఆరోపణలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ తీవ్రంగా ఖండించింది. మిల్లా ఆరోపణలు నిరాధారమైనవి పేర్కొంది. ఆమె తన తల్లి ఆరోగ్యం బాగోలేదని చెప్పి వెళ్లిపోయారని.. ఆమె కోరిక మేరకే ఇంగ్లాండ్‌కు తిరిగి వెళ్ళడానికి ఏర్పాట్లు చేశామని స్పష్టం చేసింది. ఆమె ఇండియాలో ఉన్నప్పుడు కృతజ్ఞత, ఆనందం వ్యక్తం చేసిన అన్‌ఎడిటెడ్ వీడియోలను కూడా విడుదల చేయనున్నట్లు మిస్ వరల్డ్ ఛైర్‌పర్సన్, సీఈఓ జూలియా మోర్లే తెలిపారు. తాజాగా ఈ వివాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మిస్ వరల్డ్ లాంటి అంతర్జాతీయ వేదికలపై మహిళల పట్ల వివక్షాపూరిత ఆలోచనలు ఉన్న మెంటాలిటీనీ ఎదిరించడానికి చాలా ధైర్యం కావాలని ట్వీట్ చేశారు. ఇది నిజంగా బాధాకరమన్నారు. 'మిల్లా మ్యాగీ ఒక బలమైన మహిళ, మా తెలంగాణలో మీరు ఇలాంటి అనుభవాన్ని ఎదుర్కొన్నందుకు మేము చింతిస్తున్నాం. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉంది. ఇక్కడ మహిళలను పూజిస్తాం, గౌరవిస్తాం, వారి అభివృద్ధికి సమాన అవకాశాలను కల్పిస్తాము. రాణి రుద్రమ, చిట్యాల ఐలమ్మ వంటి గొప్ప నాయకులు మా తెలంగాణ మట్టిలో పుట్టినవారే. దురదృష్టవశాత్తు, మీరు ఎదుర్కొన్న ఈ చేదు అనుభవం నిజమైన తెలంగాణను ప్రతిబింబించేది కాదు. మీరు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఏ ఒక్క మహిళ గానీ, ఆడపిల్ల గానీ ఇలాంటి భయానక అనుభవాలను ఎదుర్కోకూడదని ఒక అమ్మాయికి తండ్రిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. బాధితురాలిని విమర్శించడం, ఆమెను తప్పుగా చూపించడాన్ని ఖండిస్తున్నాను. అలాగే మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై సంపూర్ణంగా విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నాం.' అని ట్విట్టర్ ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు.

# నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

## జపాన్‌ను అధిగమించి ముందుకు

### నాలుగు ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ ప్రకటించిన నీతి ఆయోగ్



**మహా :** భారతదేశం తన సత్తా మరోమారు చాటింది. ప్రపంచంలోని అగ్ర దేశాలకు పోటీ ఇస్తూ భారత్ అన్ని రంగాలలోనూ దూసుకుపోతోంది. ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించింది. జపాన్ దేశాన్ని వెనక్కి నెట్టిన భారత్ ఇప్పుడు గర్వంగా అగ్రదేశాల చెంత నిలిచింది. 4ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ నాలుగు ట్రిలియన్ డాలర్లకు భారత ఆర్థిక వ్యవస్థ చేరుకోవడం ప్రతి ఒక్కరికి సంతోషం కలిగిస్తుంది. ఇప్పటి వరకు 4వ స్థానంలో ఉన్న జపాన్ ను వెనక్కి నెట్టి భారత్ ఆ స్థానాన్ని దక్కించుకొని నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడం గర్వించదగ్గ అంశమని ఈ విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ ఫీలవుతున్నారు. భారతదేశం ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని నీతి అయోగ్ ప్రకటించింది. నీతి అయోగ్ సీఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యమ్ ఈ మేరకు తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మనకంటే అమెరికా, చైనా, జర్మనీలు మాత్రమే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయని ఇప్పుడు మనం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న ప్రణాళికను కొనసాగిస్తూ ఇదే విధంగా రెండున్నర, మూడు ఏళ్లలోపు ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2010 సంవత్సరంలో భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో పదవ స్థానంలో ఉందని, 2019 నాటికి బ్రిటన్ వెనక్కి నెట్టి ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆయన వెల్లడించారు. ఆరు సంవత్సరాల కాలంలో నాలుగు స్థానాలు పైకి ఎగబాకి భారత్ తన సత్తా చాటింది అని పేర్కొన్నారు. ఆర్థిక అభివృద్ధి 2026 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ అంచనాలు దాదాపు 4187.017 డాలర్లకు చేరుకుంటుందని ఇప్పటికే ఐఎంఎంఎఫ్ వరల్డ్ ఎకనామిక్ అవుట్ లుక్ ఏప్రిల్ ఎడిషన్ నివేదిక ఒక అంచనా వేసింది. ఇక వచ్చే రెండేళ్లలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆ నివేదికలో పేర్కొంది. 2025 సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.2 శాతం 2026లో 6.3 శాతం వృద్ధి నమోదు చేస్తాయని అంచనా ఉంది. భారత ఆర్థిక అభివృద్ధికి భారతదేశ జనాభా ఎంతగానో దోహదపడుతున్నట్టు నీతి అయోగ్ సీఈఓ వెల్లడించారు. వేగంగా అభివృద్ధి చెందే దేశంగా భారతదేశం మారిందని, 30 సంవత్సరాల కాలంలో భారత్ ఆర్థికంగా ప్రగతి సాధించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి జపాన్ దేశాన్ని ఓవర్ టేక్ చేసి భారత్ శరవేగంగా దూసుకుపోవడం ఇప్పుడు ప్రతి ఒక్కరికి సంతోషం కలిగిస్తుంది.

# ప్రభాకర్ రావుకు రెడ్ కార్నర్ షాక్!

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**నోటీసు అమలు ప్రక్రియను ప్రారంభించిన అమెరికా ప్రభుత్వం**

**అమెరికా నుంచి డిపోర్ట్ చేసేందుకు చర్యలు**

**భారత్‌కు పంపించేందుకు యూఎస్ హోం ఏజెన్సీ ప్రయత్నాలు**

**మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావుకు ఇంటర్ పోల్ రెడ్ కార్నర్ నోటీస్ ఉచ్చు బిగిసుకుంటుంది. ఆయన త్వరలోనే ఇండియాకు తిరిగి రావాల్సిన పరిస్థితులు ఒక్కోటిగా చుట్టుముడుతున్నాయ. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుకు జారీ కాబడిన రెడ్ కార్నర్ నోటీసు అమలు ప్రక్రియను అమెరికా ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభాకర్ రావును అమెరికా నుండి భారత్ పంపించేందుకు యూఎస్ హోం ల్యాండ్ సెక్యూరిటీ ఏజెన్సీ చర్యలు చేపట్టింది. ఇటు సిట్ దర్యాప్తు బృందం కూడా ప్రభాకర్ రావును రాజకీయ శరణార్థిగా గుర్తించకుండా ఫోన్ ట్యాపింగ్ అక్రమాలలో ఆయనపై ఉన్న అభియోగాలు..సేకరించిన ఆధారాలతో కూడిన నివేదిక ను అమెరికాకు అందించింది. మరోవైపు నాంపల్లి కోర్టు ప్రభాకర్ రావును జూన్ 20లోపు హాజరుకావాలని ఆదేశించింది. లేని పక్షంలో ప్రకటిత నేరస్తుడిగా గుర్తించి ఆయన ఆస్తుల స్వాధీనం జరుగుతుందని పేర్కొంది. దీంతో ప్రభాకర్ రావుకు అన్ని వైపుల చట్టపరమైన చక్రబంధం బిగుస్తుండటంతో ఆయన ఇండియాకు రాక తప్పని పరిస్థితి కనిపిస్తుంది. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం ప్రభాకర్ రావు వేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టి వేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.




ఓ వైపు విచారణకు..

గడువులోగా ప్రభాకర్ రావు విచారణకు హాజరు కాకపోతే.. ప్రకటిత నేరస్థుడిగా గుర్తించి ప్రభాకర్‌రావుకు చెందిన స్థిర, చర ఆస్తులను దర్యాప్తు అధికారులు సీజ్ చేసే అవకాశం ఉంది. కాగా, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఇప్పటికే తోసిపుచ్చిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రావును అమెరికా నుంచి రప్పించడం కోసం దర్యాప్తు అధికారులు ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేయించారు. ప్రభాకర్‌రావు తప్పనిసరిగా విచారణకు హాజరుకావాల్సిందేనని లేకపోతే ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసు ద్వారా అమెరికా అధికారులతో మాట్లాడి ఆయనను స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తామని సిట్ అధికారులు పేర్కొన్నారు.

# పాకిస్థాన్‌లో రెచ్చిపోయిన ఉగ్రవాదులు

## రాచీ-క్వెట్టా హైవేపై ఆర్మీ కాన్వాయ్‌పై దాడి.. 32 మంది పాకిస్తాన్ సైనికులు మృతి!



**మహా:** పాకిస్తాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. కరాచీక్వెట్టా హైవేపై జరిగిన దాడిలో 32 మంది సైనికులు మరణించారు. ఉగ్రవాద దాడులు ఇప్పుడు పాకిస్తాన్‌లోని ప్రధాన నగరాలకు చేరుకున్నాయి. భద్రతా వ్యవస్థ గురించి ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మరోవైపు అధికారులు ఈ సంఘటనలను దాచడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ పాకిస్తాన్ భద్రతా సంస్థల బలహీనతలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. పాకిస్తాన్ వ్యాప్తి చేస్తున్న ఉగ్రవాదం ఇప్పుడు దానికి ప్రాణాంతకంగా మారుతోంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించినందుకు ఇప్పుడు పాకిస్తాన్ అంతటా మూల్యం చెల్లించుకుంటోంది. ఖుజ్దార్‌లోని జీరో పాయింట్ సమీపంలో కరాచీక్వెట్టా హైవేపై ఒక సైనిక కాన్వాయ్‌పై ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (VBIED) దాడి జరిగింది. ఈ దాడిలో 32 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. డజన్ల కొద్దీ పాక్ ఆర్మీ సిబ్బంది గాయపడ్డారు. పాకిస్తాన్‌లోని మారుమూల ప్రాంతాల నుండి ఉగ్రవాద సంఘటనల వార్తలు వినడం సర్వసాధారణం. కానీ ఇప్పుడు పాకిస్తాన్‌లోని పెద్ద నగరాల్లో కూడా అలాంటి దాడులు జరుగుతున్నాయి. ఆ తర్వాత అక్కడి భద్రత లోపాలు స్పష్టమవుతోంది. కరాచీక్వెట్టా హైవే సమీపంలో ఆగి ఉన్న కారులో పేలుడు పదార్థాన్ని అమర్చారు. ఒక సైనిక కాన్వాయ్ ప్రయాణిస్తున్నప్పుడు అది పేలింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లో ఎనిమిది ఆర్మీ వాహనాలు ఉన్నాయి. వాటిలో మూడు వాహనాలు నేరుగా ఢీకున్నాయి. వీటిలో ఆర్మీ సిబ్బంది కుటుంబాలను తీసుకెళ్తున్న బస్సు కూడా ఉంది.

అయితే ఈ భద్రతా లోపాన్ని దాచడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం, కథను మార్చడానికి అధికారులు ఈ సంఘటనను స్కూల్ బస్సుపై జరిగిన దాడిగా చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. మే 21న అదే కరాచీక్వెట్టా హైవేపై మరో దాడి జరిగింది. బలూచిస్తాన్‌లోని ఖుజ్దార్ పట్టణానికి సమీపంలోని క్వెట్టాకరాచీ హైవేపై పిల్లలను తీసుకెళ్తున్న ఆర్మీ పబ్లిక్ స్కూల్ బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా ఐదుగురు పిల్లలు మృతి చెందారు. ఈ సంఘటనల కారణంగా, పాకిస్తాన్ సాధారణ ప్రజలలో భయానక వాతావరణం నెలకొంది.. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని చాలా కాలంగా ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు పాకిస్తాన్ లోపల ఉగ్రవాద దాడులు పెరుగుతున్నప్పుడు, పాకిస్తాన్ భద్రతా సంస్థల బలహీనతలు తెరపైకి వస్తున్నాయి.

# సరస్వతీ పుష్కరాల్లో గవర్నర్ దంపతులు

- కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఘనస్వాగతం పలికిన మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు



**మహా :** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఆదివారం మధ్యాహ్నం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల్లో పుణ్యస్నానం ఆచరించారు. త్రివేణి సంగమంలో ఆదివారం పుష్కర స్నానాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు సరస్వతి ఘాట్ లో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సరస్వతి ఏక శిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు. హైదరాబాద్ నుండి ఉదయం 11.02 గంటలకు హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకున్న గవర్నర్ దంపతులకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పుష్ప గుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.

# నేను ముందే చెప్పా.. అందాల పోటీలు మంచివి కావు

## సీపీఐ నారాయణ మరోసారి కీలక కామెంట్స్

**మహా :** హైదరాబాద్ నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ అకస్మాత్తుగా వైదొలగి, నిర్వాహకులపై సంచలన ఆరోపణలు చేసిన నేపథ్యంలో సీపీఐ నారాయణ మరోసారి కీలక కామెంట్స్ చేశారు. అందాల పోటీలు మంచివి కావని మరోసారి అన్నారు. ఆడవారిని కించపరిచే విధంగా ఉంటాయని తాను చెప్తే తన పట్ల విమర్శలు చేశారన్నారు. తాను అలా ఎందుకు అనాల్సి వచ్చిందో ఇప్పుడు అందరికీ అర్థమై ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి, ఉద్యోగుల జీతాలు పెంచకుండా, అందాల పోటీల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. 'కోట్లల్లో ఖర్చు పెట్టేది సొల్లు కార్చుకోవడానికా?' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందాల పోటీలు మహిళలను అంగడి సరుకుగా,





బహిరంగంగా వేలం వేయటం లాంటిదని, ఇది స్త్రీత్వం పవిత్రతకు అవమానకరమని నారాయణ అన్నారు. ప్రభుత్వాలు మహిళలను శక్తివంతం చేయడం, వారికి ఉపాధి అవకాశాలను సృష్టించడంలో దృష్టి పెట్టాలని, అందాల పోటీల ద్వారా అపవిత్రం చేయకూడదని ఆయన సూచించారు.

# కేరళ తీరానికి దగ్గరలో లైబీరియా భారీ నౌక పూర్తిగా మునక


## 640 కంటైనర్లలో ప్రమాదకర రసాయనాలు, భారీగా ఇంధనం

**సముద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదంతో కొచ్చి తీరంలో హై అలర్ట్**

**ఇంధనం, కంటైనర్లు తీరం వైపు వస్తే తాకొద్దని ప్రజలకు హెచ్చరిక**

**నౌకలోని 24 మంది సిబ్బందిని సురక్షితంగా కాపాడిన కోస్ట్ గార్డ్**

**ఆయిల్ స్పిల్ మ్యాపింగ్‌తో పరిస్థితిని అంచనా వేస్తున్న అధికారులు**



**మహా :** లైబీరియా దేశానికి చెందిన ఓ భారీ సరకు రవాణా నౌక కేరళ సముద్ర తీరానికి సమీపంలో పూర్తిగా నీట మునిగిపోయింది. ఈ ఘటనతో సముద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. భారత తీర రక్షక దళం (ఐసీజీ) ఈ విషయాన్ని ధృవీకరించింది. ప్రమాద సమయంలో నౌకలో ఉన్న సిబ్బందిని సురక్షితంగా కాపాడారు. కొచ్చి తీరానికి సుమారు 38 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎంఎస్‌సీ ఎల్సా3 అనే పేరు గల ఈ 184 మీటర్ల పొడవైన నౌక తొలుత ఒక వైపునకు ఒరిగిపోయింది. ఆ సమయంలో కొన్ని కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. తాజాగా, నౌక పూర్తిగా సముద్రంలో మునిగిపోయిందని ఐసీజీ అధికారులు వెల్లడించారు. ఈ నౌకలో మొత్తం 640 కంటైనర్లు ఉన్నాయని, వీటిలో 13 కంటైనర్లలో ప్రమాదకరమైన రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. మరో 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్ ఉందని, మిగిలిన వాటితో పాటు నౌకలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ రసాయనాలు, ఇంధనం సముద్రంలో కలిస్తే తీవ్ర పర్యావరణ నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో కొచ్చి తీరంలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. సముద్రంలో తేలియాడుతున్న కంటైనర్లు గానీ, బయటకు వచ్చిన ఇంధనం గానీ తీరం వైపు కొట్టుకువస్తే వాటిని తాకవద్దని కేరళ విపత్తు నిర్వహణ సంస్థ ప్రజలను హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం ఎంతమేరకు వ్యాపించిందో తెలుసుకోవడానికి 'ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ'ని ఉపయోగిస్తున్న విమానం నిరంతరం గగనతలంలో పర్యవేక్షిస్తోందని అధికారులు వివరించారు. విఝింజం పోర్టు నుంచి శుక్రవారం బయలుదేరిన ఈ నౌక, శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ చేరుకోవాల్సి ఉంది. అయితే, మార్గమధ్యంలోనే ఈ దుర్ఘటన జరిగింది. నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన భారత తీర రక్షక దళం వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. నౌకలో ఉన్న మొత్తం 24 మంది సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటన వల్ల తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. సముద్ర కాలుష్యాన్ని వీలైనంతగా నివారించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# తెలుగు రాష్ట్రాలకు రెండు వందే భారత్ స్లీపర్ రైళ్లు

## సికింద్రాబాద్ నుంచి న్యూఢిల్లీ.. విజయవాడ నుంచి తిరుపతి మీదుగా బెంగళూరు




**మహా :** కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలకు శుభవార్త చెప్పింది. త్వరలోనే ఏపీ, తెలంగాణ నుంచి వందే భారత్ స్లీపర్స్ పరుగులు తీయనున్నాయి. తొలివిడతలోనే తెలుగు రాష్ట్రాలకు రెండు వందే భారత్ రైళ్లకు ఆమోదం లభించింది. ఇందు కోసం రెండు మార్గాలు ఫిక్స్ చేశారు. అలానే టికెట్ ధర కూడా ప్రకటించారు. తెలంగాణ నుంచి ఒకటి, ఏపీ నుంచి మరొక వందే భారత్ రైలు పరుగులు తీయనుంది. సికింద్రాబాద్, విజయవాడ నుంచి ఇవి నడవనున్నాయి. సికింద్రాబాద్ నుంచి న్యూఢిల్లీకి తొలి వందేభారత్ స్లీపర్ ప్రారంభం కానుంది. ఈ రెండు ప్రాంతాల మధ్య మొత్తం 1667 కి.మీ దూరాన్ని ఒక్క రోజు సమయంలో చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు. అలానే ఏపీ విషయానికి వస్తే.. విజయవాడ నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు వందే భారత్ రైలు ఏర్పాటుపైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**సికింద్రాబాద్ టూ ఢిల్లీ రూట్ ఇదే**

సికింద్రాబాద్ నుంచి వెళ్లే వందే భారత్ రైలు రూట్‌ని ఫిక్స్ చేశారు. ఈ స్లీపర్ రైలు.. ఆగ్రా క్యాంట్, గ్వాలియర్, ఝాన్సీ, భోపాల్, ఇటార్సి, నాగపూర్, బల్హార్షా, కాజిపేట్ జంక్షన్ స్టేషన్ల మీదుగా వెళ్తుంది. ఇక రూట్‌లో వెళ్లే వందే భారత్ స్లీపర్ రైలులో థర్డ్ ఏసీ కోచ్ ఛార్జీ రూ. 3600గా, సెకండ్ ఏసీ కోచ్ ఛార్జీ రూ. 4800గా, ఫస్ట్ ఏసీ కోచ్ ఛార్జీ దాదాపు రూ. 6000 ఉంటుంది. న్యూఢిల్లీ నుండి రాత్రి 08:50 గంటలకు బయలుదేరే ఈ వందే భారత్ స్లీపర్ రైలు.. మరుసటి రోజ రాత్రి 08:00 గంటలకు సికింద్రాబాద్ చేరుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేసారు. ఇది పట్టాలెక్కితే ఒక్క రోజులోనే సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ చేరుకోవచ్చు. ఇక ఏపీ నుంచి నడిచే వందే భారత్ స్లీపర్ రైలు గురించి కూటమి నేతలు కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ రైలు పట్టాలెక్కిన తర్వాత విజయవాడ నుంచి అయోధ్య, వారణాసికి కేటాయింపుపై తొలి రెండు విడతల్లోనే ప్రకటన ఉంటుందని చెబుతున్నారు. అంతేకాక ప్రస్తుతం విజయవాడ నుంచి వరంగల్ మీదుగా రెగ్యులర్ రైళ్లు ప్రయాణించే మార్గంలోనే వందే భారత్ స్లీపర్‌ను అయోధ్యకు కేటాయించేలా నిర్ణయం తీసుకోబోతున్నారని తెలుస్తోంది. ఇక ఈ రైలు అందుబాటులోకి వస్తే.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో సౌకర్యవంతంగా, సులభంగా అయోధ్య, వారణాసి వెళ్లవచ్చు అంటున్నారు. ఈరెండు వందేభారత్ రైళ్లకు ఆమోదముద్ర వేస్తూ వచ్చే వారం ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# బీ కేర్ ఫుల్.. కరోనా కేసులు పెరుగుతున్నాయ్

## రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్..



**మహా :** కరోనా రీ ఎంట్రీ మళ్లీ కలకలం రేపుతోంది. కొత్త రూపంలో పంజా విసురుతోంది. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులే అందుకు నిదర్శనం. పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా పట్టణాల్లోనే కరోనా కేసులు నమోదు అవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెండు కొత్త వేరియంట్లలో కరోనా ప్రభావం చూపిస్తున్నట్లు ఇండియన్ జీనోమిక్స్ కన్సార్టియం నిపుణులు గుర్తించారు. ఎన్.బి.1.8.1, ఎల్ఎఫ్.7 అనే కరోనా వేరియంట్స్ ను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే.. జేఎన్.1 వేరియంట్ కేసులు నమోదయ్యాయి.. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీలో కేసులు పెరుగుతున్న దృష్ట్యా.. అప్రమత్తంగా ఉండాలని.. అన్ని సౌకర్యాలతో ఆస్పత్రులను సిద్ధం చేసుకోవాలంటూ అధికారులు సూచనలు జారీ చేశారు. దేశంలోనే అత్యధికంగా కేరళలో కరోనా ఇన్‌ఫెక్షన్లు వెలుగులోకి వస్తున్నాయి. కేరళలో 200 మందికి పైగా కరోనా లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. దాంతో.. ఆస్పత్రుల్లో మాస్కులు తప్పనిసరి చేసింది కేరళ ప్రభుత్వం.. మహారాష్ట్రలోనూ కరోనా కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఒక్క ముంబైలోనే ఈ నెలలో 95 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కర్నాటకలో 35 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఢిల్లీలో 24 గంటల్లో 23 కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో కరోనా కేసులు నమోదు అవుతుండగా నోయిడాలో తొలి కరోనా కేసు రికార్డ్ అయింది. గాజియాబాద్‌లో ఇప్పటికే 4 కేసులు నమోదు అయ్యాయి. తమిళనాడులో సైతం కేసులు పెరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రభుత్వాలు ఇప్పటికే అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.భారతదేశంలో రెండు కొత్త కోవిడ్19 వేరియంట్లు - ఎన్ బీ.1.8.1, ఎల్ఎఫ్.7 - కనుగొనబడ్డాయని.. ఇప్పటివరకు దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.. కనీసం 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేసులు వెలుగు చూశాయి. ఇదిలాఉంటే.. కోవిడ్ సంబంధిత లక్షణాలతో ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు పేర్కొంటున్నారు. దీనిపై అధికార సమాచారం రావాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల్లోనూ మళ్లీ కరోనా కలవరం మొదలైంది. తెలంగాణలో తొలి కరోనా కేసు నమోదైంది. విశాఖలో 2 కరోనా కేసులు, కడపలో రెండు కేసులు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అలెర్ట్ అయిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు.. విశాఖ జీజీహెచ్‌లో కరోనా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.

### రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్..

ఇక.. దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో అన్ని రాష్ట్రాలను కేంద్రం అలెర్ట్ చేసింది. ముందు జాగ్రత్తగా ఆస్పత్రులు సిద్ధం చేయాలని ఆదేశించింది. అయితే.. ఆయా రాష్ట్రాల్లోని కరోనా బాధితులకు కేవలం స్వల్ప లక్షణాలు మాత్రమే ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. బాధితుల్లో ఎక్కువ మంది ఇంట్లోనే చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపింది. భయపడాల్సిన అవసరం లేదని సూచించింది.

# జీవితాల్లోకి చొచ్చుకువచ్చిన కథలు

## ఒక పాఠకుడి స్పందన

గత పదేళ్లుగా పత్రికల్లో వస్తున్న వ్యాసాల ద్వారా బద్రి నర్సన్ రచయితగా నాకు పరిచితులే. ఆయన రాసే వ్యాసాల్లో సమాచారంతో పాటు ప్రస్ఫుటించే మానవీయ కోణం పాఠకులను రచయితకు దగ్గర చేస్తుందనేది నా వ్యక్తిగత భావన, అనుభవం. వ్యాసాలతో పాటు అప్పుడప్పుడు పత్రికల్లో వచ్చే ఆయన కథలు కూడా ప్రత్యేకంగానే ఉంటాయి. ఆ కథలు 'దారి తెలిసిన మేఘం' పేరుతో సంపుటిగా వచ్చాయి అని తెలిసిన వెంటనే పుస్తకాన్ని తెప్పించుకున్నాను.




సామాజిక అంశాలతో కూడిన ఈ కథలు పాఠకులను ఆకట్టుకొనేలా ఉన్నాయి. రచయిత స్వయంగా చెప్పుకున్నట్లుగానే తను వ్యాసాల్లో చెప్పే విషయాలనే కథల ద్వారా మరింత ఎక్కువమందికి చేరేలా ప్రయత్నించారు. అయితే వ్యాసాల్లో ఉండే సమాచార వివరణ, విశ్లేషణ కథలను రక్తి కట్టించదు. ఆ విషయాన్ని గ్రహించిన ఈ రచయిత కొన్ని పాత్రలను సృష్టించి, వాటి మధ్య సంఘటనలు, సంభాషణలతో ఎంచుకున్న సామాజిక అంశంపై ఆసక్తి పెంచి పాఠకులతో చదివించగలిగారు. అందుకే ఒక పత్రిక వీటిని వార్తా కథలు అని పేర్కొంది.

ఈ కథల్లో సుమారు యాభై ఏళ్ల సామాజిక గమనం నాకు కనిపించింది. బంధాలు అనుబంధాలు, జానకి విముక్తి కథలు ఆనాటి మనుషుల ఆలోచనల్లో వస్తున్న మార్పులను సూచిస్తాయి. రెండూ ఆనాటి పడుపువృత్తి నేపథ్యంలో రాసిన వాస్తవిక కథలు. 'జానకి విముక్తి' లో రచయిత ఆనాటి వేశ్యల బతుకుల్లోని భయంకరమైన వాస్తవాలను విప్పి చెప్పారు. జానమ్మ, బానయ్య, దీప పాత్రలు మరిచిపోలేనివి. నాకు ప్రత్యేకంగా నచ్చిన కథ ఇది. జగిత్యాల, ధర్మపురి శివార్లలో వేశ్యావాటికలుండేవి. చాలా మంది మగాళ్లకు అటు వెళ్లిన అనుభవం ఉండేది. కోర్టు కేసులు హాజరయేందుకు ఆ ఆడవాళ్లు ముస్తాబై గుంపుగా బజారు గుండా వెళుతుంటే మగాళ్లకు అదో వేడుకలా సాగేది. అయితే ఆ మేకప్ ల వెనుక ఉన్న దుర్భర విషాదం ఈ కథలో కనబడుతుంది. సంఘటనలు సహజంగా ఉండడం వల్ల కథ కళ్ళకు కట్టినట్లు ఉంది. అలా ఈ కథ నన్ను వెంటాడుతూనే ఉంటుంది.

మూడు స్తంభాలాట, జీవన తీరాలు, కాలజ్ఞానం.. ఈ మూడు కథలు విప్లవోద్యమ సంఘటనలతో కూర్చినవి. కరీంనగర్ ప్రాంతంలో 1970 , 80 దశకాల్లో ఉవ్వెత్తున లేచిన నక్సలైట్ల పోరు వీటిలో చర్చించబడింది. ఆనాటి విద్యార్థి, యువత జీవితాల్లో ఉద్యమ ప్రభావం ఎలా ఉండేదో ఈ కథల్లో సహజంగా ఉంది. కర్మకాండ, జేష్టపాలు కథలు చావును ప్రధానంగా చేసుకొని రాసినవి. మరణించిన వ్యక్తిని కించపరిచే విధానంగా ఉన్న మన ఆచారాలను వీటిలో తీవ్రంగా ఖండించారు. ఇలా ప్రతి కథకు ఓ బలమైన సామాజిక వాస్తవికత, నేపథ్యం ఉన్నాయి. అవే కథను నడిపిస్తాయి.

సంపుటిలోని ఇరువై కథల్లో ఆధునిక సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కొన్ని సీరియస్ కథలున్నాయి. 'పాలు మరచినవాళ్లు' లో భర్తను కోల్పోయిన స్త్రీలు ఎదిగి వచ్చిన కొడుకుల చీత్కారానికి గురయ్యే పరిస్థితులను అందరూ ఔను కదా అని తలదించుకునేలా విప్పి చెప్పారు. 'మరక మంచిదే'లో ఆడవారి నెలసరి గుప్తతపై మూడు తరాల్లో వచ్చిన మార్పును స్వాగతించారు. 'రబ్బరుబొమ్మ' సెరిబ్రల్ పాల్సీలో పుట్టిన బిడ్డను తీర్చిదిద్దిన మహాతల్లి కథ. సుమిత్ర, ఎనిమిదో అడుగు కథలు కూడా మహిళల పక్షాన నిలిచేవే.

జైళ్లలో ఉరిశిక్షలను అమలు చేసే తలారి కథ 'ఈ శిక్ష మాకొద్దు'. ఇప్పటివరకు తెలుగులో ఈ అంశంపై కథ రాలేదని ముందుమాటలో ఆడెపు లక్ష్మీపతి గారు అన్నారు. ఈ కథలో లేవనెత్తిన సమస్యలపై చర్చ అవసరం. వీటికి ఓ పరిష్కారం కావాలి. సాధారణ పాఠకులకు ఈ కథలు నచ్చుతాయని నా అనుభవంతో చెబుతున్నాను. వారం క్రితం రచయిత బద్రి నర్సన్ 'కథల్లో మీకు నచ్చిన, నచ్చని అంశాలు చెప్పండి' అని ఫీడ్ బ్యాక్ కోరారు. అప్పటికే కథలు చదివి ఉన్నాను కాబట్టి నాకు తెలిసింది రాశాను.

**- ఎన్. లక్ష్మీకాంతం, కరీంనగర్.**

### పాలపిట్ట – వాసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ ఫలితాలు

1. మొదటి బహుమతి: వీరగల్లులమై విస్తరిద్దాం – కరిపె రాజ్‌కుమార్
2. రెండో బహుమతి: మంట – ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
3. మూడో బహుమతి: పిడికెడు ముద్ద – ములుగు లక్ష్మీ మైథిలి

ఎనిమిది మంది కవితలకు ప్రత్యేక బహుమతులు

1. ఇంకా శ్వాసిస్తూనే ఉన్నట్టుంది – దేవనపల్లి వీణావాణి
2. నల్ల చీర మనిషినే – బి. కళాగోపాల్
3. ఎన్ని చెప్పినా తక్కువే – చిత్తలూరి సత్యనారాయణ
4. నదిలాంటి మనుషులు – లేదాళ్ళ రాజేశ్వరరావు
5. ఆలస్యమైపోయింది – సింహాద్రి నాగ శిరీష
6. మానవతా గీతం – డా. కె. దివాకరాచారి
7. ప్రసవించిన తూర్పు – పర్కపెల్లి యాదగిరి
8. సెల్ఫీ కళ – ఎడమ శ్రీనివాసరెడ్డి

న్యాయ నిర్ణేతగా డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్ వ్యవహరించారు.

మరో తొమ్మిది మంది కవితలు సాధారణ ప్రచురణకు ఎంపికయ్యాయి.

**1. అమ్జద్ 2. ఏనుగుల కిశోర్ బాబు 3. జోరు పవిత్ర కృష్ణ 4. రమేశ్ నల్లగొండ 5. ఐలేని గిరి 6. బొల్లారపు బాబన్న 7. కోటం చంద్రశేఖర్ 8. బి. బాలకృష్ణ 9. బెహరా ఉమామహేశ్వరరావు**

- పాలపిట్ట బుక్స్

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.


*ప్రతి కథా రచయిత, రచయిత్రికి కథలు రాసే పద్ధతి వేరు వేరుగా వుంటుంది, అది వారి వారి వ్యక్తిగతం. ప్రస్తుతం ప్రపంచ కథా వేదిక మీద తన 12 కన్నడ కథల ఇంగ్లీష్ అనువాదం Heart Lamp'సంపుటి తో 2025 సంవత్సరం బుకర్ ప్రైజ్ గెలుపొందిన రచయిత్రి బాను ముష్తాక్ తన కథన పద్ధతి గురించి ఏ మంటున్నారో మహా దిన పత్రిక సాహిత్య పేజీ పాటకుల కోసం -సం॥.*

# బాను ముష్తాక్
# నేనూ, నా కథా ప్రపంచమూ..

## అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ విజేత – 2025

కథలు రాసే ప్రవృత్తి నాకొక మనోహరమైన ప్రయాణం. కథ రాసే సన్నివేశం తాలూకు మహదానందం నన్ను ఎంతగానో తేలికపరుస్తుంది. అపారమైన చైతన్యాన్ని అందిస్తుంది. మంచి అదనుకొచ్చిన నా ఎదపొలంలో విత్తబడిన బీజం ఏనాటికీ శుష్కించిపోదు. మొలకెత్తకుండా అలాగే గర్భస్థమై ఉండొచ్చు. అది మూడు రోజుల్లోనైనా అంకురించవచ్చు. ముప్పై ఏళ్ళకైనా మొలకెత్తవచ్చు. ఒక్కోసారి ఉన్నపళంగా రాత్రికి రాత్రే నాకే తెలియక నాలో చిగురించి పుష్పించి ఫలభారంతో వంగి పోవచ్చును. కళాత్మకమైన అభివ్యక్తి మాత్రం నా కళ్ళముందే సహచరిగా ప్రకాశిస్తుంది. ఆ శిల్ప సాంకేతికత నా అవగాహనకు ఇంతవరకూ అందలేదు. ఒక సంఘటన, ఒక వ్యక్తి, ఒక సంభాషణ, బీజరూపంలో ఉన్న ఒక విషయం... ఇవి మాత్రమే నా ఎరుకలో ఉంటాయి. మిగిలినవన్నీ వీటన్నింటి చుట్టూ అల్లుకున్న నా ఊహలూ, కల్పనలూనూ.






అది... నేను కృష్ణరాజసాగర్లో మాధ్యమిక పాఠశాలలో చదువుతున్న కాలం. బడి వదలగానే నేను చంద్రమౌళీశ్వర దేవస్థానానికి పరుగెత్తేదాణ్ణి ! ఆ ఆవరణంలో ఉన్న సంపంగి చెట్ల మీద కోతి కొమ్మచ్చి ఆడటం నాకిష్టమైన ఆట. పూజారి కూతురు వసంతి నా స్నేహితురాలు. ఓరోజు... ఆవరణ దాటి చాలాదూరం పోయాం. సంధ్యాసమయం. అక్కడ ఎవరిదీ కాని కంచె మీదున్న జామపండ్లు తస్కరించడం మా ఉద్దేశం. నలుగురైదుగురు స్నేహితులమున్నాం. అందరూ చెట్టెక్కారు. నేను ఎక్కాలను కునేంతలోపు ఓ చిన్న చప్పుడు వినిపించింది. చుట్టూ పరికించాను. ఊహూ.. ఏదీ కన్పించలేదు. అయినా నా లోపల ఏదో భావన. చెట్టు ఎక్కకుండానే మెల్లిగా నిట్టూర్చుతూ వినవస్తోన్న చప్పుడు వైపు చెవులు రిక్కించి కళ్ళు తెరిచే ఉంచాను. అలాగే ఆ కంచెను సాంతం పరికించి చూస్తుండగానే అది కనిపించింది. పొడుగాటి ఆకుపచ్చని దేహం. తోక వుంది. ఆ దేహమ్మీద గుండ్రని బిళ్ళలాంటి చర్మం. కళ్ళల్లో కళ్ళుపెట్టి చూస్తుండగానే నా శరీరం విపరీతమైన భయంతో చెమట పట్టింది. అది ఊగుతూ ఊగుతూ ఓ కాలు ముందుకుపెట్టి తర్వాత వెనక కాలును ముందుకు జరుపుతోంది. ఇది జరిగి ఎన్నో ధాబ్దులు గడిచినా ఆ సంఘటన నా కళ్ళెదుట అలాగే కదలాడుతున్నది. నేను నించున్న చోటనే కొయ్యబారి పోయాను. భయం, ఆందోళన, కుతూహలం మొదలుగా కొత్త అనుభవంలోకి వచ్చిన అంశాలు ఎంతసేపు అలా నిలబడిపోయానో తెలీదు. చెట్టు మీదెక్కి పళ్ళు తెంపిన ఓ స్నేహితురాలు ఓ పండు నావైపు విసిరేసింది. దాంతో నేను ఈ లోకంలోకి వచ్చాను. నేను చెప్పిన విషయం వాళ్ళెవరూ నమ్మలేదు. నా కళ్ళకు కనిపించిన ఆ ప్రాణి వాళ్ళకి కన్పించలేదు. దాని చప్పుడు వాళ్ళకి విన్పించనే లేదు. ఆ ప్రాణి ఇప్పటికీ ఎడతెగకుండా వేధిస్తోంది. అది ముందు నన్ను భయపెట్టింది. 'హిసు' అంది. కోరలు సాచింది. నేను పడుకుంటే నాతో నా మంచమ్మీదే పడుకుంది. నేను ఛటుక్కున లేచి అరవసాగాను. చివరికి అది ఎక్కడో నా గుండెమూలల్లో కానీ ఆశ్రయం తీసుకుంది. అప్పుడప్పుడు నాతో స్నేహం చేయ ప్రయత్నిస్తోంది. కానీ నేనందుకు ఆమోదం తెలపలేదు. ఆ తర్వాతెప్పుడో దాని పేరు అలుగు అని తెలిసింది. అది మహా అలసత్వం కల్గిన సోమరి ప్రాణి. నా నుండి దానికీ, దాని నుండి నాకూ విముక్తి దొరకలేదు. ఎవరికీ కనిపించనిది నాకే ఎందుకని కనిపించింది? ఎవరికీ వినిపించని గుండె సవ్వడులు నాకెందుకు విన్పిస్తాయి. ఇదిగో ఇక్కడే అచ్చంగా నా కథలు ఉత్పత్తి అవుతాయి.

నాకు రకరకాల అనుభవాలున్నాయి. అల్పసంఖ్యాక సమాజంలోని స్త్రీగా నాకు కనిపించిన ప్రమాదం విచిత్రమైన సవాళ్ళతో కూడి కనిపిస్తున్నది. స్పందించే గుణం, సంవేదనాశీలం ఉన్న కారణాన మరింత వైవిధ్యంతో కూడిన లోచూపుల ప్రపంచం కనిపిస్తున్నది. చదవటం అనేది నన్ను మొత్తంగా ఆవహించిన ఓ రకపు పిచ్చి. పఠనం గురించి నాకు విపరీతమైన ఆకలి. ఒక్కోసారి నా అవసరానికి తగిన పఠనావరణంలో పర్యాప్తమవుతాను. కొన్నిసార్లు ఏ రకమైన కట్టుబాటు లేని తిరుగుబోతు వంటి పఠనం చేతికి చిక్కిందల్లా చదువుతాను. మరోమారు పుస్తకాలు రాశులుగా ఎదుటవున్నా వాటివైపు కన్నెత్తి చూడను. మైకం కమ్మినట్లు నాకు పఠనం. అనుభవం గురించి చెప్పాలంటే పఠనం కన్నా నాకు అనుభవమే ఇష్టమైనది. అనుభవం కలిగినపుడు నా ఎదలో చిన్నపిల్లల వంటి కుతూహలం కల్గి ఏర్పడుతుంది. వ్యక్తిగత అనుభవాల వేదన, నొప్పి, దుఃఖం, యాతన... ఇంకా సార్వజనిక జీవనంలోని.. మంచీ చెడూ.. ఇంకా ముసుగులు, ద్వంద్వ నీతులు నా హృదయంలో అనేక భావతరంగాలను పుట్టిస్తాయి.

నాది అత్యంత ప్రయోగాత్మకమైన మనస్సు. అంటే ఆచరణాత్మకం. నేను కాలేజీలో ఉన్నపుడు నిద్ర మాత్రల పర్యవసానాలు తెలుసుకునేందుకు మూడు మాత్రల్ని ఒకేసారి మింగాను. దానితో నా శరీరమూ, మనస్సు మీద జరిగే పరిణామాల్ని గట్టిగా చెబుతూ నేను చెబుతున్న వాటిని రాయమని మా చెల్లిని పురమాయించాను. అది పిరికి పిల్ల. నేను చెప్పింది వదిలి మిగిలిందంతా చేసింది. ఆమెకు తీరా అసహజంగా ఉన్న ఆ సందర్భంలో ఆమె ఎంతగా గాభరా పడిందంటే నా కనురెప్పలు బలంగా బరువుగా మూతపడే నా అనుభవం చూసి గట్టిగా కేకలు వేసింది. ''దీది చచ్చిపోయింది. అదే పెదబొబ్బకి ఇల్లంతా నా చుట్టు చేరింది. అప్పుడు మేం వేసవి సెలవులకి మా తాతగారింట 'హసన'లో ఉన్నాం. సెలవులకి వచ్చిన మా మేనత్త గారు, ఇతర బంధుజనం మధ్య మా అమ్మ భయంతోనూ, సిగ్గుతోనూ తలదించుకుంది. నాన్న ఎంతో బాధపడ్డాడు. ఆరోగ్యశాఖలో ఉద్యోగి అయిన మా నాన్న పర్యవేక్షణలో నేను ఓ పగలు ఓ రాత్రి నిద్రపోయి లేచాను. కానీ చుట్టుపక్కాల ప్రశ్నార్థకమైన చూపులు తట్టుకోవటం కష్టమైంది నాకు. అయితే దీనివెనుక వేరే రకమైన కథ ఒకటి రూపుదాల్చింది. మా చెల్లికి నేను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఉత్తరం రాస్తున్నట్లూ, నేను ఆ మాత్రలు ఆత్మహత్య కొరకే మింగినట్టూ అనేక కథలు పుట్టాయి. ''సరైన సమయంలో మా చెల్లి అలా అరచి అందరికీ తెలిపి నన్ను బ్రతికించింది'' అని చెల్లి చేసిన మేలును తెగ పొగిడారు. నా కోపం ఆపుకోలేక ఓ రెండ్రోజులయ్యాక చెల్లిని పిలిచి ఒకటి రెండు అంటించాను. మరో రెణ్ణాళ్ళు పోయాక నాన్న ఏమైందని అడిగాను నన్ను. నిద్రమాత్రల అనుభవం ఎలా ఉంటుందో చూద్దామని మింగినట్టు చెప్పాను. ఎవ్వరూ నన్ను నమ్మలేదు, మా నాన్న తప్ప. ఆ సంగతి మళ్ళీ ఎప్పుడూ ప్రస్తావించలేదాయన. ఇక ఇటువంటి స్వీయానుభవాలు వెనుకబట్టినా సహజంగానే నా బ్రతుకులోని వ్యక్తిగత అనుభవాలూ, సార్వజనిక అనుభవాలూ అవకాశాలూ నాకు చాలా అందివచ్చిన నా అనుభవాల అక్షయపాత్ర గొప్పది. ప్రయోగశీలత నా నైజగుణం.

నా వ్యక్తిగత జీవిత సలహాదారుడిగా మా నాన్న ఉన్నారు. ఎత్తైన ధ్వజస్తంభం వంటి వ్యక్తిత్వం. ఆకాశ నీఇమ కల్గిన అతని కళ్ళల్లో సాగరమంత దయ. తల్లి పిచుక పిల్ల పిచుక నోట్లో ఆహారాన్ని అందించే తల్లి వంటి మనస్సు. నా మీద అచంచలమైన విశ్వాసం. మా కుటుంబం మొత్తంలో సాహిత్యం పట్ల ఆకర్షితురాలైన మొదటి తరంలోని మొదటి వ్యక్తిని నేనే! పైగా స్త్రీని. ముస్లిం అమ్మాయిని పెంచి సంసారయోగ్యురాలిని చేసే ప్రయత్నంలో నా కుటుంబం మాత్రమే కాక మా వంశం యావత్తూ పాలుపంచుకుంది. మొట్టమొదట కన్నడంలో విద్యాభ్యాసం చేసినందువల్ల, ఎటువంటి కట్టుబాట్లకు లొంగకుండా స్వతంత్ర ప్రవృత్తి కల్గి వున్నందు వల్ల నా గురించి అందరికీ అనేక అనుమానాలున్నాయి. అందరూ అనేక ప్రయత్నాలు చేసి నన్ను సంకెళ్ళలో బంధించలేక నిరాశ పడిపోయి చివరికి అంతా చేరి ''వంశానికి కళంకం తెస్తోంది'' అనేసారు. కానీ మా మొత్తం కుటుంబంలో మా నాన్న మకుటం లేని మహారాజు. ఆయన నన్ను గాలిపటంలా గగనానికి ఎగరేసారు. ఆయన నాతో చెప్పకున్నా ఇప్పుడు నాకనిపిస్తోంది. నేనూ, నాన్నా ఒకే దారంతో బంధించబడి వున్నాం. ఆకాశపు ఎత్తులకు గాలిని స్పర్శిస్తూ, సంఘర్షిస్తూ నేను నన్నే దాటిపోవచ్చును. మా నాన్నగారి అపారమైన ప్రేమ, నమ్మకం ఇంకా అలాగే ''యూ ఆర్ ఏ స్పెషల్ లేడీ'' అని సంబోధనలోని వెలుగు. ఈ భూప్రపంచంలోనే నా కూతురిలాంటి బుద్ధిమంతురాలు మరెవరూ లేరనే మా నాన్నగారి గర్వం.. ఇవన్నీ నాకు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కల్పించాయి. ఎవరినైనా దేన్నైనా ఎంత దూరమైన ఎదిరించగల నన్న మనోబలాన్ని కల్గించాయి. ముఖ్యంగా కనుకొలకులు కన్నీటి తడితో నిండిపోయే బ్రతుకుమీద ప్రేమను పెంచాయి. వ్యక్తిగత జీవితంలో నా పెంపకానికి సంపూరకంగా ఉండే సకారాత్మక వాతావరణం సంపూర్ణంగా ఉంది. కానీ నా రచనా వ్యాసంగానికి కుటుంబ ప్రోత్సాహం లభించే వీలు లేదు. నాన్న తప్ప. ఆయన నాకు అసంఖ్యాకమైన పుస్తకాలు కొనిచ్చారు. అతనిదంతా అప్పుల బ్రతుకు. నాకు పుస్తకాలు కొనేందుక్కూడా అప్పు చేసేవారు. నేను పత్రికల్ని బాగా చదివేదాన్ని. వాటిల్లో ఏదైనా పోటీకి కథల్ని ఆహ్వానిస్తూ కాగితానికి ఒకవైపే రాయాలనే నిబంధన ఉండేది. చాలా ఏళ్ళ దాకా అదేమిటో అర్థం కాలేదు. అది స్పష్టంగా తెలియకే నేను రాసిన కాయిదాలు ఎక్కడెక్కడో ఉండిపోయినై. ఈ విషయమైనా కాలేజి వ్యాసంగ సందర్భంలోనూ ఏవిధమైన సలహానో, మార్గదర్శనమో నాకు దొరకలేదు.

నేను డాక్టరును కావాలనుకుని పియుసిలో సైన్స్ ఐచ్ఛికంగా తీసుకున్నాను. తర్వాత సఫలీకృతురాలును కాలేక సైన్సులో డిగ్రీ చేసాను. ఎలా చూసినా సాహిత్యానికీ నాకూ దూరపు బంధుత్వం కూడా లేదు. కానీ రాయాలన్న ఆసక్తి, సాహిత్య సంబంధితమైన సంవేదనలు నాలో సదా మేల్కొని వుంటున్నాయి. అభివ్యక్తికి సంబంధించిన అనేక ఇబ్బందులతో నేను సతమతమై గాబరా పడి మౌనంగా వుండిపోయాను. అభివ్యక్తికి సంబంధించిన రాచబాట కాదు కదా, కనీసం కాలిబాట కూడా దొరక్క అవస్థపడ్డాను. బదులుగా నా దారిని నేను సృష్టించుకుని నేను ఏకాకిగా ముందుకు నడవాల్సిన అనివార్యత నా సాహితీ ప్రస్థానంలో మైలురాయిగా మారింది. విమర్శ గురించి చెప్పుకోవాలంటే నా సాహిత్యం గురించి పెద్దగా విమర్శ రాలేదు. కానీ మొదట్నించీ నా రచనల గురించి ప్రత్యేకమైన ఆసక్తిని చూపిస్తున్న జి.ఎస్. అమూర, సబిహా భూమిగౌడ, ఎం.ఎస్. ఆశాదేవి, కె. షరీఫా నా పుస్తకాలను విమర్శించారు. నేను చూడని కొన్ని విశిష్టమైన అంశాలను కూడా తమ సూక్ష్మమైన సునిశిత దృష్టితో అవలోకించారు. ఎంతోమంది పరిశోధక విద్యార్థులు నా పుస్తకాలపై పిహెచ్. డి., ఎం.ఫిల్. లు చేసారు. రచయిత్రిగా నాకు ఈ అంశాలు ఎంతో సంతృప్తినీ, ఆత్మవిశ్వాసాన్నీ కల్గించాయి.

సాధారణంగా నేను దేన్నైనా చదువుతున్నపుడు దగ్గర ఓ నోటుబుక్కు ఉంచుకుంటాను. అలా చదువుతున్నపుడు ఏదో ఒక నా జీవనానుభవం ఛటుక్కున స్ఫురించి విచిత్రమైన మలుపులతో ఎదురుపడి మొత్తం కథా, పాత్రలూ, సంభాషణలూ, ముగింపు, కథ పేరుతో సహా అన్నీ కళ్ళ ముందు కదలాడుతాయి. తర్వాత అవన్నీ నా మెదట్లో రిజిష్టరవుతాయి. ఇలాంటి సందర్భాలు అనేకం.

రాసిన తర్వాత నేను వెంటనే పత్రికలకు పంపను. ముద్రణకు ఇవ్వను. కథ పూర్తయ్యి కాసేపు నెమ్మదిగా విశ్రమిస్తుంది. నాకు చాలా సంకోచం కనుక నేను కథ రాసాను, పత్రికలో వేస్తారా అని అడగటం నాకు సరిపడని విషయం. 'నా కూతురును పెళ్ళి చేసుకుంటారా?' అని అడిగే సందర్భంలో కలిగే లజ్జ, అసహాయత, సందిగ్ధత.. ఇలా ఏవేవో నన్ను చుట్టుముడతాయి. ఇలా నా కథా సంపుటిలోని అనేక కథలు ఏ పత్రికల్లోనూ ప్రచురించబడ్డేదు. నేరుగా పుస్తక రూపంలో వచ్చాయి. పి.లంకేశ్ ఉన్నపుడు న్నూ మరికొందరూ నన్ను కథ పంపండి అనడిగేవారు. ఫలానా తేదీ లోగా కావాలనగానే అది నావల్ల సాధ్యమయ్యేది కాదు. పైగా ఇన్ని పేజీలే ఉండాలనే నిబంధనా నాకిష్టమయ్యేది కాదు. ఏ రకమైన ఆనకట్టలూ, అడ్డుకట్టలూ లేకుండా నా మానాన నేను ప్రవహించాలి. పరవళ్ళు తొక్కాలి. ఆ పరవళ్ళతో రాళ్ళూ రప్పలూ అరిగి నున్నబడాలి. అరణ్యాల శీతలత్వంలోంచి పర్వతశ్రేణుల్లోంచి గలగలమంటూ పరుగులు తీయాలి. మైదాన ప్రాంతంలో నెమ్మదించాలి. ఎడారుల్లో అంతఃస్రవంతిలా మారాలి. ఉత్తర దక్షిణ ధ్రువప్రాంతాల మంచునై పోవాలి. మానవ జీవన కథల్ని గానం చేస్తూ, జీవిత యానంలోని అనుభవాల ముత్యాలరాళ్ళు రెండు చేతులతో చల్లుతూ వెళ్ళాలి. పాఠకులు నేరుగా ఎంపిక చేసుకొననీ శబ్దార్థాల గొడవ వద్దంటూ అంతరార్థపు ధమనుల్లో జీవద్రవ్యాన్ని నింపుకొననీ చెరకుగడలోంచి రసాన్ని పీల్చి పొట్టును పారేసినట్లు పారవేయనీ నాకు ఫరవాలేదు. పాఠకులకు అనిపించింది రచయితలకు చేరాలనే వ్యవస్థ ఒకటుండాలి. ఇటీవల సామాజిక వ్యవస్థలు కొన్ని ఇలాంటి బాధ్యతని తీసికున్నాయి. పాఠకుడికీ, రచయితకీ మధ్య చక్కని సంబంధ బాంధవ్యాలు ఉండాలి. పాఠకుని ప్రతిస్పందన, అతని ఆపేక్ష... రచయితకు చాలా అవసరం.

రాయదలచుకున్న కథ పూర్తిగా చాలా లోతుగా నా ఎదలో వేళ్ళూనుకోవాలి. ఆ మానసిక స్థితి నన్ను ఆవహించినపుడు, కథ మొత్తం నా కళ్ళ ముందు విస్పష్టంగా అరచేతి గీతల్లా అగుపించినపుడు నాకు రాయటం సాధ్యమవుతుంది. చాలా రోజుల తరబడి తినికి తినికి కొన్ని నెలల వరకు రాస్తే అది నా మంచి కథ కాదు. నేనోసారి రాసానంటే మళ్ళీ దిద్దను. అలా ఒక్కసారి ఉన్నఫళంగా ఉదయించిన కథ అప్పుడే పుట్టిన బిడ్డలా తనదే ఐన ప్రత్యేకతతో ఉంటుంది. నేనా బిడ్డ నొసటిని నిమరను. చప్పిడి ముక్కును సాగదీయను. ఆ శిశువు కనుల అందాన్ని భంగపరచను. అది దానిలాగే ఉండాలి. నాకేనాడూ కథ రాసాక అయ్యో దీన్ని మరో విధంగా రాస్తే బాగుండేది కదా అన్న ఆలోచనే రాదు. నేనా కథకు సంపూర్ణత అందిస్తాను. అందుకని నాకు ఎలాంటి అసంతృప్తులూ ఉండవు. కథలో నేను ఏమి చెప్పాలని ఆలోచిస్తానో అదుగో ఆ కేంద్ర బిందువుకు మిగిలిన అన్ని అంశాలూ సంపూరకంగా ఉండేట్లు ఒక భావస్థితిలో మూడ్ లో వుండిపోతాను. అయితే రాసేటప్పుడు అది మరో స్వరూపాన్నీ పొందవచ్చు.


నాకు నా కథల లిమిటేషన్ తెలీదు. నాకు నాదైన ఒక లోపలి ప్రపంచం ఉంది. ఆ ప్రపంచపు కలలున్నాయి. వాస్తవికత ఉంది. అమాయకత్వం, అబ్బురపాటూ ఉన్నాయి. ఎవరైనా నాతో వచ్చి ఆత్మీయంగా ఆ లోకంలో విహరించదలిస్తే నేను వెంట ఉంటాను. నేను సిద్ధాంతాలకు లొంగను. నా కథలు కన్నడ కథా వారసత్వంలో ఉత్కృష్ట స్థానాన్ని పొంది తీరుతాయని నా భావన.

''దేవుడూ, ప్రమాదమూ'' అనే కథ ఓ పత్రికలో వచ్చింది. అదయ్యాక వారానికి నేను 'హసన'కు వెళ్ళాను. అక్కడేదో కార్యక్రమంలో పాలుపంచుకున్నాను. కార్యక్రమం ముగిసాక ఇంటికి బయల్దేరాను. అంతలోనే ఓ స్త్రీ వచ్చి నన్ను గట్టిగా కౌగలించుకుని కాళ్ళ మీద పడింది. నేనిలాంటి వాటికి వ్యతిరేకిని. నేనామెను లేవనెత్తి ఆమెను గట్టిగా తిడదామనుకునేలోపు ఆమె అతి దయనీయంగా ఏడవసాగింది. ''మేడమ్! మూడు రోజుల ముందు నా భర్త చనిపోయారు. ఆయన అస్వస్థతతో ఆసుపత్రి పాలయ్యారు. నేను పత్రిక కొన్నాను కానీ చదవలేదు. శవాన్ని మార్చురీలో ఉంచారు. నా వెంట ఎవరూ లేరు. నాకు భయమైంది. పత్రిక తెరిచాను. అందులో మీ కథుంది. ఒక్క అక్షరాన్నీ వదలక మొత్తం చదివాను. నాతోపాటే నా పక్కనే మీరున్నారు అని అనిపించింది నాకు. ఆ తర్వాత వాళ్ళూ వీళ్ళూ వచ్చారు. ఐదుగంటల వరకు నేనున్నానక్కడ. అటువంటి సమయంలో ఆపదలో మీరు నా చేయి పట్టుకుని ఉన్నారు. అందుకే కార్యక్రమాలన్నీ అయిపోయాక మిమ్మల్ని చూడాలనిపించింది. ఆపదలో నా చేయి పట్టుకుని నాతో పాటు ఉన్న మీ పాదాలకు ప్రణమిల్లాలనిపించింది'' అంది ఆమె. అది ఆమె భావనాప్రపంచం. నా కళ్ళు సజలాలయ్యాయి. నేనేమీ మాట్లాడలేకపోయాను.

మరో సందర్భం, ముస్లిం యువదంపతుల గొడవ. నేను మధ్యవర్తిని. భర్త స్ఫురద్రూపి. ఉన్నత స్థానంలో ఉన్నాడు. నేనాయణ్ణి బయటకు పంపించి భార్యనడిగాను అన్ని విషయాలూ. ఆమెకు దాంపత్యం ముఖ్యమని సలహా యిచ్చాను. ఆమె బొటబొట కన్నీరు కార్చుతూ ''మీకు తెలియదు మేడం. అతను చూట్టానికి అలాగే ఉంటాడు. గొప్ప సంస్కారిలా కన్పిస్తాడు. కానీ నేను మీ కథలోని హసీనలాగా అవస్థ పడుతున్నాను'' అంది వివరించింది. ఈ రెండూ నన్ను కదిలించిన మానవీయ సంఘటనలు.

రచయితకు బాల్యం అమూల్యమైన గని అని చాలామంది అంటుంటారు. కన్నడ కథా రచయితలు తాము అనుభవించిన బాల్యపు అనుభూతుల్ని సృష్టించటంలో సిద్ధహస్తులని అందరూ అంటున్నారు. కానీ అది పూర్తి నిజం కాదు. ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణల అన్ని పాజిటివ్, నెగెటివ్ పరిణామాల్ని చిత్రిస్తు కన్నడిగులు విశ్వవ్యాప్తమై ఉన్నారు. ఇప్పుడిప్పుడే విలక్షణమైన కథల్ని అందిస్తున్నారు. ఇంకా ముమ్ముందు ఈ విషయంలో మరింత ఎక్కువగా ఆశావహంగా ఉండవచ్చును.

**- కన్నడం నుంచి అనువాదం** (మయూర, జులై 2017)



**- నలిమెల భాస్కర్, 97043 74081**

**రచయిత్రి పరిచయం**

*బాను ముష్తాక్ : 2025 అంతర్జాతీయ బుకర్ ప్రైజుకి ఎంపికైన తొలి కన్నడ రచయిత్రి. 'హాసన్' నగరంలో న్యాయవాది. కన్నడ కథా సాహిత్యంలో ప్రత్యేకమైన ముద్ర ఆమెది. ''బెంకిమళె (అగ్నివర్షం), సఫీరా, బడవర మగళు హెణ్ణల్ల'' (పేదవాళ్ళ కూతురు స్త్రీ కాదు), హసీనా మరియు ఇతర కథలు'' వంటి కథా సంపుటాలు ప్రచురించారు. అనేక వ్యాసాలు రాసారు. కవిత్వం కూడా రాసారు. బాను గారి కథలు హిందీ, మలయాళం, తమిళం, పంజాబి, ఉర్దూ, ఇంగ్లీషుల్లోకి వెళ్ళాయి. ఆమె ఓ కథను ఆధారంగా గిరీశ్ కాసరవళ్ళి ''హసీనా'' సినిమా తీసారు. దానికి మూడు జాతీయ పతకాలు వచ్చాయి. ఆదిల్ షాహి చరిత్ర గ్రంథాన్ని (తారీక్-ఎ-ఫరిష్తా')ను అనువదించారు కన్నడంలోకి. సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర వహిస్తారు. 1990 నుండి 2023 వరకు ఈమె రాసిన కథల్లోంచి పన్నెండింటిని ఎంపిక చేసి దీపా భస్తీ ''హార్టు ల్యాంప్'' పేరుతో ఆంగ్లీకరించారు. ఆ అనువాదానికి ఇద్దరికీ చేరో 25 వేల పౌండ్ల నగదు పురస్కారం లభించింది.*

## ఆర్కపల్లి రేషన్ డీలర్ పై ఎమ్మార్వోకు ఫిర్యాదు

**ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు జర్పుల విజయ్ కుమార్ నాయక్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆర్కపల్లి రేషన్ డీలర్ పై ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసిన జర్పులతండా గ్రామ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు. రంగారెడ్డి జిల్లా, మాడుగుల మండలం, జర్పుల తండా గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన అర్హులకు ప్రొసీడింగ్స్ అందజేసి, సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, రాజకీయాల గురించి ప్రచారం చేయడాన్ని ప్రశ్నిస్తూ, అర్కపల్లి రేషన్ డీలర్ జర్పుల లక్ష్య నాయక్ పై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జర్పుల విజయ్ కుమార్ నాయక్, మాడుగుల మండల ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశాడు. ఆర్కపల్లి రేషన్ డీలర్ పై చర్యలకు ఆదేశాలు జారీ చేసినట్లు విజయకుమార్ తెలిపారు.

# కరవకుండా... నియంత్రించలేరా..?

## రోజురోజు పెరిగిపోతున్న వీధి కుక్కల బెడద

## ప్రభుత్వానికి హై కోర్టు ఆదేశాలు

### జిల్లా అధికారులు దృష్టి సారించాలి..ఏబిసి కేంద్రాలు నిర్మించాలి అప్పుడే సమస్యను నియంత్రించగలరు

> వీధి కుక్కల సమస్య జిల్లాలో తీవ్రతరమవుతుంది. ముఖ్యంగా చిన్న పిల్లలు చనిపోతుండటం తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. కుక్కల నియంత్రణకు కావాల్సింది గణాంకాలు కాదు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఏం చర్యలు తీసుకుంటూనారనేది ప్రధానం. ఈ సమస్యపై తక్షణ చర్యలు చేపట్టేలా కమిటీని నియమించాలని, రాష్ట్ర ప్రభుత్వానికి హై కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలో నిత్యం ఏదో ఒక ఊరిలో, ఏదో ఒక వీధిలో, ఎవరో ఒకరు కుక్క కాటుకు గురవుతున్నారు. చిన్న పాటి గాయలతో కొందరు బయటపడుతుంటే మరి కొందరు తీవ్ర గాయాలతో నరకయాతన అనుభవిస్తున్నారు. కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రజలలో కుక్కలను చూస్తే ఒక భయం మొదలవుతుంది. చిన్న పిల్లలు బయటకు వస్తే కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని తల్లిదండ్రు ఆందోళన చెందుతున్నారు.

**పంచాయతీల్లో గాలికొదిలేశారు...!**

గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కల సంతతిని నియంత్రించే భాద్యతలను అధికారులు గాలికొదిలేసినట్లు కనిపిస్తోంది. చట్టాలు సహకరించకపోవటంతో తామేం చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. వాస్తవనికి పంచాయతీ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకొని సమీప అడవుల్లో వదలాలి. లేని పక్షంలో వాటికి మత్తు మందు ఇచ్చి, కు. ని. చికిత్సలు చేయించాలి. ఇవేమి గ్రామాల్లో జరగకపోవటంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోయి గుంపులుగా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

**ఏబీసీ కేంద్రాలు నిర్మిస్తేనే...**

ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాలు రంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో మాత్రమే ఉండటంతో వీధి కుక్కల నియంత్రణ కష్టతరమవుతోంది. అన్ని పురపాలికల్లో వీటిని నిర్మిస్తే కు.ని.చికిత్సలు పెరిగే అవకాశముంది. అయితే ఏబీసీ కేంద్రం ఏర్పాటుకు ప్రత్యేకంగా కిచెన్ గది, డార్క్ రూం, ఆపరేషన్ థియేటర్, ప్రిపరేటరీ గది, సిబ్బంది గది వంటివి ఉండాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని వీటి నిర్మాణానికి నిధులు కేటాయించాలి.

**స్థానికులు..**

వీధి కుక్కల కారణంగా కొన్ని సందర్భంగా బయటికి రావాలంటే రాలేని పరిస్థితి ఏర్పడుతుందని, వీటి నియంత్రణకు తగు చర్యలు తీసుకొని, వాటిని అరికట్టే విధంగా ప్రభుత్వం, అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుచున్నారు.



## ధరఖాస్తులు 1600 కేవలం మంజూరైన ఇండ్లు 60

**ఇందిరమ్మ ఇండ్లకు ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు?**

**మిగిలిన వారు ఎంపిక కాకపోవడానికి కారణాలేంటి?? మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ ప్రభుత్వం హంగు, ఆర్భాటాలతో మొదలు పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిరుపేలదలను కాంగ్రెస్ సర్కారు తీవ్ర అన్యాయానికి గురి చేస్తుందని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... కడ్తాల్ గ్రామపంచాయతీ పరిధిలో రెండు, మూడు విడతలలో ఇందిరమ్మ ఇండ్లకు, నిరుపేదలు ఆశావాహులు సుమారు 1600 కుటుంబాలు దరఖాస్తు చేసుకోగా, కేవలం 60 మందిని మాత్రమే లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల తిరస్కరణకు గల కారణాలను వెంటనే గ్రామపంచాయతీల వారిగా గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలను మభ్య పెట్టేందుకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మరొకసారి కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే అట్టడుగు స్థాయికి తెలంగాణ దిగజారిందని వాపోయారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా ఊసే లేదని, యాసంగిలో అందించాల్సిన రైతు భరోసా వాన కాలం వచ్చేవరకు కూడా అందకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు 2500, యువతులకు స్కూటీలు, కల్యాణ లక్ష్మి పథకం ద్వారా తులం బంగారం ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన నిర్వాకంతో విసుగు చెందిన మిస్ ఇంగ్లాండ్ వ్యాఖ్యలు అంతర్జాతీయ వేదికగా తెలంగాణ బ్రాండ్ ను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, బీఆర్ఎస్ నాయకులు గురిగళ్ల రామచంద్రయ్య, మహమ్మద్ ఇర్షాద్, సిద్ధిగారి వెంకటేష్, జల్కం నాగార్జున, గూడెపు మహేష్, పోతగల్ల మహేష్, గురిగళ్ల కృష్ణ, భాస్కర్, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కోట్లు ఖర్చుపెట్టి కాటేదాన్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించారు

**మెయింటెనెన్స్ లేక శిధిలావస్థకు చేరిన వైనం**

**కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో వందల సంఖ్యలో పావురాలు మృత్యు ఘోష పట్టించుకోని ప్రజాప్రతినిధులు అధికారులు**



**రాజేంద్రనగర్, మహా :** 16 సంవత్సరాల నుంచి సుమారు 24 కోట్లు ఖర్చుపెట్టి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం తలపెట్టారు. కోట్లు ఖర్చు అయిపోయాయి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిరూపయోగంగా మారింది. స్పోర్ట్స్ కాంప్లెక్స్ పావురాలకు నిలయంగా మారింది. కాంట్రాక్టర్లు స్విమ్మింగ్ పుల్, డోర్లు కోసం విలువైన వస్తువులు బిగించారు. సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్కు ఎలాంటి సెక్యూరిటీ లేకపోవడంతో దొంగలు అందిన కాడికి దోచుకెళ్లారు. గత అసెంబ్లీ ఎన్నికలలో అధికారులు స్పోర్ట్స్ కాంప్లెక్స్ ని వినియోగించుకున్నారు. అధికారులు ఉండడానికి కావలసిన వసతులను కాంప్లెక్స్ లో ఏర్పాటు చేశారు. పావురాలు విసర్జను తొలగించి చుట్టుముట్టు వలను ఏర్పరచుకున్నారు.

ఎన్నికల అయిపోయాయి అధికారులు వెళ్లిపోయారు. కట్టిన వల అలాగే ఉండిపోవడంతో పావురాలు వందల సంఖ్యలో చిక్కుకొని మృత్యువాత పడ్డాయి. తమ ఆరోగ్యాలను కాపాడుపొందడానికిసుమారు 200 మంది యోగా కోసం కోందరు, స్కేటింగ్ శిక్షణ పొందడానికి కొందరు చిన్నారులు, కిక్ బాక్సింగ్ కోసం మరి కోందరు, వాకింగ్ కోసం కొందరు, ఇలా సుమారు 200 మందికి పైగా శిక్షణ పొందుతూ తమ ఆరోగ్యాలను కాపాడుకుంటూన్నారు. ఆరోగ్యాలు కాపాడుకోవడం దేవుడు ఎరుగు, పావురాలు విసర్జనతోపాటు, చనిపోయిన పావురాల దుర్వాసనకు సంబంధిత శిక్షణ పొందుతున్న చిన్నారులతోపాటు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసిన ప్రజా ప్రతినిధులు గాని అధికారులు అటుపక్క తొంగి చూడలేరు. ప్రజా ప్రతినిధులు సమస్యలను పరిష్కరించి ప్రజలకు చేరువయ్యే విధంగా ఉండాలి, కానీ ప్రజా ప్రతినిధులు తమకెందుకులే అని ఉద్దేశంతో ఉన్నారు.

**వివేకానంద యోగా సమితి అధ్యక్షులు భద్రయ్య**

గత మూడు నెలలుగా యోగా చేస్తున్న సమయంలో పావురాల మృత్యువాత పడడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఇప్పటివరకు అధికారులు ఇతర నాయకులు ఇటుపక్క తొంగి చూడలేదు, యోగ సభ్యులము దుర్వాసనకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ సమస్యను ప్రజా ప్రతినిధులు గాని అధికారులు గాని పరిష్కరించాలని కోరుతున్నాం. ఏమి తెలియని పావురాలు నిర్జీవంగా వలలో పడి ఉన్నాయి. వాటిని ఎక్కడి నుంచి తొలగించాలన్నారు. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కి సెక్యూరిటీ గార్డ్ ని ఏర్పాటు చేయాలని కోరారు.

వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నరసింహ రాజు, మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో సుమారు లక్షలకు పైగా జనాభా ఉంటారు. అద్భుతంగా నిర్మాణం తలపెట్టిన కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో ప్రతినిత్యం తమ ఆరోగ్యాలను కాపాడుకోవడానికి వందల సంఖ్యలో చుట్టుముట్టు ప్రాంత వాసులు వస్తూ ఉంటారు. మృతివాతపడ్డ పావురాల నుంచి దుర్వాసన వస్తుంది గత మూడు నెలలుగా స్థానిక నాయకులకు స్థానిక అధికారులకు తెలిపిన ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు ఈ సమస్యను పరిష్కరించి కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కి సెక్యూరిటీ గార్డ్ ని ఏర్పాటు చేయాలన్నారు.

## శంషాబాద్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొన్న లారీ, కానిస్టేబుల్ మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు ఒకరి పరిస్థితి విషమం**




**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద షాపూర్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద షాపూర్ జాతీయ రహదారి పై పెట్రోలింగ్ వాహనంలో వచ్చిన పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేస్తుండగా కొత్తూరు నుంచి వేగంగా వస్తున్న లారీ పోలీస్ పెట్రోలింగ్ వాహనాని ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రమాదంలో విజయ్ కుమార్ అనే కానిస్టేబుల్ మృతి చెందాడు. మరో ముగ్గురు కానిస్టేబుల్ లకు తీవ్ర గాయాలయ్యాయి ముగ్గురి పరిస్థితి విషమం ఉంది. క్షతగాత్రులను సమీపంలోని యశోద హాస్పిటల్ కు తరలించారు. లారీ డ్రైవర్ రమేష్ కామేంబ్లి మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా నడపడం వల్లే లారీ అదుపుతప్పి పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని డికొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్నా శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన కానిస్టేబుల్ విజయ్ కుమార్ శంషాబాద్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్నాడు.

## రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం

**రైల్వే స్టేషన్ అడ్డుగోడును తొలగించండి.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్**



**రాజేంద్రనగర్, మహా :** మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో శివరాం పల్లి రైల్వే స్టేషన్ ముందు ప్లే కార్డులతో ఆదివారం ధర్నా నిర్వహించారు. డివిజన్ పరిధిలో నుంచి బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున వచ్చి రైల్వే గేట్ కు అడ్డంగా ఉన్న పరిహారి గోడను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆరాంఘర్ బ్రిడ్జి కింద సిసి రోడ్ పనులు జరుగుతుండడంతో అటువైపు వెళ్లాలన్న కొన్ని కిలోమీటర్లు తిరగవలసి వస్తుంది. శివరాంపల్లి రైల్వే స్టేషన్ గోడను తొలగిస్తే మైలార్దేవ్పల్లి డివిజన్ వాసులకు ఇబ్బంది ఉండకుండా ఉంటుందన్నారు. గతంలో ఎంపీకి ఎమ్మెల్యేకు ఎన్నో ఫిర్యాదులు చేశాము. రాకపోకలకు ఇబ్బంది అవుతుంది శివరాంపల్లి రైల్వే స్టేషన్ అడ్డు గోడను తొలగిస్తే డివిజన్ ప్రజల రాకపోకల సమస్య పరిష్కరించబడుతుందని తెలిపాం, ఎంపీ ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో డివిజన్ ప్రజల రాకపోకల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ప్రజలపై దయవుంచి ఎమ్మెల్యే ఎంపీ సమస్యను పరిష్కరించాలని డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమ శ్రీనివాస్, రాము యాదవ్, రఘు యాదవ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇక్కడి నుంచి స్కూల్ పిల్లలు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం అవుతుందని అన్నారు పలు మార్లు ఎమ్మెల్యేకు వినతిపత్రం ద్వారా కంప్లీట్ ఇచ్చిన కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈరోజు అంతా ఏకమై ఈ యొక్క ధర్నాలో చేపట్టామని అన్నారు ఇక్కడ గంజాయి బ్యాచ్ లకు కేరాఫ్ అడ్రస్ గా మారింది నిత్యం గంజాయి సేవిస్తూ వచ్చే పోయే ప్రయాణికులను ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్యకర్తలు అన్నారు ఈ పరిహారి గోడ వల్ల ఎవరికైనా గర్భిణీ స్త్రీ ఎమర్జెన్సీ హాస్పిటల్ కి వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు తిరిగి వెళ్ళవలసి వస్తుందని అంతలోపే చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని స్థానికులు తెలిపారు.

## అల్ స్టైల్ కుంగ్ ఫు అధ్యక్షులుగా నేరెళ్ల శ్రీధర్ గౌడ్



**కరీంనగర్ మహా:** అల్ స్టైల్ కుంగ్ ఫు యూనిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంను ఆదివారం కరీంనగర్ లోని స్థానిక వాగ్దేవి కళాశాలలో నిర్వహించారు.. సంఘం ఏర్పడి సంవత్సరం పూర్తయి పూర్వ సంఘ సభ్యుల కాలం పూర్తయిన సందర్భముగా నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. అధ్యక్షులుగా నేరెళ్ల శ్రీధర్ గౌడ్, జనరల్ సెక్రెటరీగా బొడ్డు రాజమల్లు అలాగే ట్రెజరర్ గా ఎలగందుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు అలాగే గౌరవ సలహాదారులు ఉదరి యాదగిరి, మహేశ్వర హరికృష్ణ ,బార విద్యాసాగర్ వొడ్నాల శ్రీనివాస్ పండ్రాల లింగమూర్తి.. లీగల్ అడ్వైసర్ సతీష్ ఉపాధ్యక్షులుగా కోడూరి శేఖర్, చందనం రాజేందర్ బద్దెనపల్లి రాజు జాయింట్ సెక్రటరీగా కస్తూరి ప్రవీణ్,గగ్గూరి దివ్య,శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ అభినందించారు

## అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి ఎక్సలెన్స్ అవార్డు

**కరీంనగర్ మహా:** తెలంగాణ రాష్ట్ర విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నందుకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.వి. నరేందర్ రెడ్డి వెంకట్ ఫౌండేషన్ వై రఘునాథం ఎక్స్లెంట్ అవార్డు అందుకున్నారు.. ఆదివారం స్థానిక కరీంనగర్ శివారులోని ప్రైవేటు వేడుక మందిరంలో వెంకట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో వివి లక్ష్మీనారాయణ రిటైర్డ్ ఐపిఎస్ పూర్వ జాయింట్ డైరెక్టర్ సిబిఐ గంప వెంకట్ ఫౌండర్ & చైర్మన్ వెంకట్ ఫౌండేషన్ ఇతర అతిధుల చేతుల మీదుగా వెంకట్ ఫౌండేషన్ వై రఘునాథం ఎక్స్లెంట్ అవార్డు ప్రధానం చేశారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి మార్గదర్శకంగా నిలుస్తున్నందుకుగాను.. ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్న గాను అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ విద్యను అందిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యారంగాలలో సమూలమైన మార్పులు తెస్తున్నందుకుగాను నేడు వై.రఘునాథం ఎక్స్లెంట్ అవార్డు ప్రదానం చేసినట్లు వారు తెలిపారు.


**ఈ సందర్భంగా ఆల్ఫోర్స్**

డా.వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా విద్యారంగానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని ఎంతోమంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా వారిని ప్రతిష్టాత్మక స్థానాలలో స్థిరపడేందుకు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.




## ఎట్టకేలకు విడుదలైన పూలే చిత్రం

**ప్రసాద్ ఫిలిం ల్యాబ్ నందు సినిమాను వీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు**



**షాద్ నగర్, మహా:** సామాజిక సంస్కర్త మరియు రచయిత, మహాత్మా జ్యోతిరావు పూలే మరియు అతని భార్య మరియు సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే ఆధారంగా రూపొందించబడిన బాలీవుడ్ బయోపిక్ పూలే, అనేక వివాదాల తర్వాత ఎట్టకేలకు ఈరోజు విడుదలైంది.ఈ చిత్రంలో ప్రతీక్ గాంధీ మరియు పత్రలేఖ ప్రధాన పాత్రల్లో నటించారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ సలహాదారు కేశవ రావు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్,ఆది శ్రీనివాస్,ప్రకాష్‌గౌడ్, బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు.

మహా
తెలుగు దినపత్రిక

మహా పత్రిక చదవండి

# బహుమతులు గెలవండి

Mahaadaily.com



## ప్రతీ శనివారం బంపర్ డ్రా

మహా డైలీ
Scan to Read

## మహా పాఠకులకు పట్టాభిషేకం



మీరు చేయాల్సిందల్లా మహా పత్రికలో ఈ రోజు మీకు నచ్చిన వార్తను స్క్రీన్ షాట్ తీసి 7436939999 కు మీ వివరాలతో పంపండి
విజేతల వివరాలను పత్రికలో ప్రచురించడంతో పాటు బహుమతులు అందజేస్తాం



ANN TELUGU

ప్రతి రోజూ ప్రత్యేక కథనాలు
మహిళల కోసం మహారాణి, యంగ్, ఎడ్యుకేషన్
మహా సినిమా, అంతర్జాతీయ వార్తలు,
కొత్త కోణాలు

కోటి మంది వీక్షించే ఛానల్ https://epaper.mahaadaily.com/




# జపాన్‌ను అధిగమించిన భారత్: మరో మూడేళ్ళలో..

2047 నాటికి వికసిత భారత్ సాధ్యమవుతుందని 'నరేంద్ర మోదీ' చాన్నాళ్లకు ముందే పేర్కొన్నారు. ఈ దిశగానే కేంద్రం కూడా అడుగులు వేస్తోంది. కాగా ఇప్పుడు.. జపాన్‌ను అధిగమించి.. భారతదేశం ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ 'బీవీఆర్ సుబ్రహ్మణ్యం' పేర్కొన్నారు. నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశం తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ.. మొత్తం భౌగోళిక, రాజకీయ, ఆర్థిక వాతావరణం భారతదేశానికి అనుకూలంగా ఉన్నాయని సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం.. ప్రస్తుతం భారతదేశం కంటే.. అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే పెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాయి. మనం ఇప్పటికే వేసుకున్న ప్రణాళికలకు కట్టుబడి ముందుకు సాగితే.. మరో మూడేళ్ళలో మనం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తామని సుబ్రహ్మణ్యం వెల్లడించారు. తయారీ రంగం అభివృద్ధి, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం వంటివి మాత్రమే కాకుండా.. ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటివి దేశాభివృద్ధికి కీలకమని ఆయన అన్నారు. భారతదేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. వికసిత భారత్‌లో ఇది పెద్ద అడుగు. ఇలా జరిగేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు అంటూ కేంద్ర మంత్రి 'జితేంద్ర సింగ్' తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

## ఆ ఒక్క రాష్ట్రంలోనే ఐదు లక్షల కార్లు: SIAM డేటా..



సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ తయారీదారుల (SIAM) డేటా ప్రకారం.. 202425లో భారతదేశంలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలలో 'మహారాష్ట్ర' మొదటి స్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్ ద్విచక్ర వాహనాల అమ్మకాలలో ముందుంది. SIAM డేటా ప్రకారం.. 2024 25లో మహారాష్ట్రలో ప్యాసింజర్ వాహనాల (PV) అమ్మకాలు 5,06,254 యూనిట్లు (11.8 శాతం)గా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ 4,55,530 యూనిట్లు (10.6 శాతం), గుజరాత్ 3,54,054 యూనిట్లు (8.2 శాతం) అమ్మకాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత నాల్గవ స్థానంలో కర్ణాటక 3,09,464 యూనిట్లతో (7.2 శాతం), హర్యానా 2,94,331 యూనిట్లతో (6.8 శాతం) ఐదవ స్థానంలో ఉన్నాయి.

ద్విచక్ర వాహన విభాగంలో.. ఉత్తరప్రదేశ్ 28,43,410 యూనిట్ల అమ్మకాలతో (14.5 శాతం వాటా) అగ్రస్థానంలో ఉంది. మహారాష్ట్ర 20,91,250 యూనిట్లతో (10.7 శాతం), తమిళనాడు 14,81,511 యూనిట్లతో (7.6 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. నాలుగు, ఐదు స్థానాల్లో కర్ణాటక (12,94,582 యూనిట్ల), గుజరాత్ (12,90,588 యూనిట్లు) ఉన్నాయి. త్రిచక్ర వాహనాల విభాగంలో.. ఉత్తరప్రదేశ్ అత్యధికంగా 93,865 యూనిట్లు (12.7 శాతం) అమ్మకాలు జరపగా, గుజరాత్ 83,947 యూనిట్లు (11.3 శాతం), మహారాష్ట్ర 83,718 యూనిట్లు (11.3 శాతం) అమ్మకాలు జరిపాయని డేటా తెలిపింది. కర్ణాటక 70,417 యూనిట్లతో (9.5 శాతం) నాల్గవ స్థానంలో, బీహార్ 47,786 యూనిట్లతో (6.4 శాతం) ఐదవ స్థానంలో నిలిచాయి.

# డబ్బు ఆదా చేయొద్దు.. పేదవారవుతారు

## రాబర్ట్ కియోసాకి



అతిపెద్ద మార్కెట్ క్రాష్ జరగబోతోంది, ఆర్థిక సంక్షోభం రాబోతోంది, బంగారం రూ.21 లక్షలకు చేరుతుందని చెప్పిన రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసా'కి తాజాగా చాలా మంది ప్రజలు పేదలుగా ఎందుకు మిగిలిపోతున్నారో వెల్లడించారు. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ కూడా తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. రాబర్ట్ కియోసాకి రెండు ఆర్థిక సూత్రాలను ''గ్రేషమ్స్ లా, మెట్‌కాల్ఫ్ లా'' గురించి వివరిస్తూ.. ప్రజలు పేదవారు కావడానికి కారణాలను చెప్పారు. 'డబ్బును పొదుపు చేసేవారు ఓడిపోతారు' అని పేర్కొన్నారు.

గ్రేషమ్స్ లా ప్రకారం.. 'చెడు డబ్బు వ్యవస్థలోకి ప్రవేశించినప్పుడు.. మంచి డబ్బు దాగిపోతుంది'. ఎలా అంటే యూఎస్ డాలర్ లేదా భారతీయ రూపాయి వంటివి కాలక్రమేణా విలువను కోల్పోయే అవకాశం ఉంది. నిజమైన డబ్బును ఆదా చేయాలంటే.. బంగారం, వెండి, బిట్‌కాయిన్ వంటి వాటిలో పెట్టుబడి పెట్టండి. మెట్‌కాల్ఫ్ లా అనేది.. నెట్‌వర్క్స్. దీనికి ఉదాహరణగా ''మెక్‌డొనాల్డ్స్ ఒక ఫ్రాంచైజ్ నెట్‌వర్క్. మామ్ పాప్ బర్గర్స్ అనేది కాదు. ఫెడెక్స్ ఒక నెట్‌వర్క్. జో వన్‌ట్రక్ డెలివరీ అనేది కాదు'' అని కియోసాకి వివరిస్తూ.. నేను బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెడతాను ఎందుకంటే అది ఒక నెట్‌వర్క్.. అయితే చాలా క్రిప్టోలు కాదని అన్నారు. మీరు ధనవంతులు కావాలనుకుంటే.. చట్టాలను పాటించండి అని కియోసాకి చెప్పారు. ''వస్తువులలో మాత్రమే పెట్టుబడి పెట్టండి, ధనవంతుడు మీ నుంచి కొనుగోలు చేస్తాడు'' అనే మైఖేల్ సాయిలర్ మాటలను రాబర్ట్ కియోసాకి వెల్లడించారు. నేను యూఎస్ డాలర్లను ఆదా చేయను, ఎందుకంటే పొదుపు అనేది గ్రేషమ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తుంది. అలాగే నేను నెట్‌వర్క్‌లు లేని చెత్త నాణేలలో పెట్టుబడి పెట్టను, ఎందుకంటే అవి మెట్‌కాల్ఫ్ చట్టాన్ని ఉల్లంఘిస్తాయి. అందుకే నేను బంగారం, వెండి, బిట్‌కాయిన్‌ల మీదనే పెట్టుబడి పెడతాను. అయితే ఈ చట్టాలని పాటించాలంటే జాగ్రత్త కూడా వహించాలని ఆయన అన్నారు.

# సరికొత్త ప్లాట్‌ఫామ్: రూ.1 లక్ష లోపే బైక్!



ఎలక్ట్రిక్ మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ కొత్తగా ఓ100 (ఓ హండ్రెడ్) పేరిట రెండో ప్లాట్‌ఫాంపై కసరత్తు చేస్తోంది. రూ.1 లక్ష లోపు ధర ఉండే మోటర్ సైకిల్స్ తయారీ కోసం దీన్ని ఉపయోగించనున్నట్లు కంపెనీ ఫౌండర్ మధుమిత అగర్వాల్ తెలిపారు. ఈ ప్లాట్‌ఫాంపై రూపొందించిన వాహనాలను ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఆవిష్కరించనున్నట్లు వివరించారు. దేశీ టూ వీలర్ల మార్కెట్లో దాదాపు 30 శాతం వాటా ఉంటున్న 100 సీసీ వాహనాలకు సరిసమాన సామర్థ్యం ఉండే ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి ప్రవేశించేందుకు ఇది ఉపయోగపడనున్నట్లు మధుమిత అగర్వాల్ పేర్కొన్నారు.

# షియోమీ మరో ఎలక్ట్రిక్ కారు: జూలైలో లాంచ్!

ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ తయారీదారు అయిన షియోమీ తన 'వైయూ7' ఎలక్ట్రిక్ కారు అమ్మకాలను జూలైలో ప్రారంభించనున్నట్లు.. కంపెనీ సీఈఓ 'లీ జున్' పేర్కొన్నారు. ఈ కొత్త మోడల్ చైనాలో టెస్లా బెస్ట్ సెల్లింగ్ కారు 'వై'కి ప్రత్యక్ష పోటీదారుగా ఉంటుంది. చైనా సంస్థ 'షియోమీ' ఇప్పటికే తన లగ్జరీ ఎలక్ట్రిక్ సెడాన్ 'ఎస్‌యూ7' (SU7) అల్ట్రా కారును కూడా మార్కెట్లో లాంచ్ చేసింది. ఇప్పుడు మరో కారును తీసుకురావడానికి సన్నద్ధమైంది. ఈ కొత్త వైయూ7 ఎలక్ట్రిక్ కారు.. ఒక సింగిల్ ఛార్జితో 835 కిమీ రేంజ్ అందిస్తుందని సమాచారం. దీని ధర 60,000 70,000 యువాన్‌ల (సుమారు రూ.8 లక్షలు) వరకు



ఉండే అవకాశం ఉంది. అయితే అధికారిక ధరలు జులైలో వెల్లడవుతాయి. ఈ కారు డిజైన్, ఇతర ఫీచర్స్ అన్నీ కూడా త్వరలోనే వెల్లడవుతాయి. షియోమీ లాంచ్ చేసిన ఎస్‌యూ7 ఎలక్ట్రిక్ కారు 2,58,000 యూనిట్ల కంటే ఎక్కువ అమ్మకాలను పొందినట్లు తెలుస్తోంది. ఇది స్టాండర్డ్, ప్రో, మ్యాక్స్ అనే మూడు వెర్షన్‌లలో లభిస్తుంది. వీటి ధరలు వరుసగా రూ.25.18 లక్షలు, రూ. 28.67 లక్షలు, రూ. 34.97 లక్షలు. ఇవి మూడు చూడటానికి చాలా మంచి డిజైన్, లేటెస్ట్ ఫీచర్స్ కలిగి ఉంటాయి. కాబట్టి ఎక్కువమంది వీటిని ఇష్టపడి కొనుగోలు చేశారు. ఆరు కలర్ ఆప్షన్లలో లభించే షియోమీ ఎస్‌యూ7 ఎలక్ట్రిక్ కారు 5.28 సెకన్లలో 0 నుంచి 100 కిమీ వరకు వేగవంతం అవుతుంది. దీని టాప్ స్పీడ్ 210 కిమీ/గం కాగా.. ఇది 400 న్యూటన్ మీటర్ టార్క్, 299 పీఎస్ పవర్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇందులోని 73.6 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ సింగిల్ ఛార్జీతో గరిష్టంగా 800కిమీ రేంజ్ అందిస్తుంది.



## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL





# నోటి దురుసు వ్యాఖ్యలు చేయొద్దు

## నేతలకు ప్రధాని మోదీ వార్నింగ్

**ఢిల్లీ:** బీజేపీ నేతలకు ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరికలు జారీ చేశారు. సున్నితమైన అంశాలపై మాట్లాడే విషయంలో నేతలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆదివారం ఢిల్లీలో ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో సమావేశం జరిగింది. ఈ భేటీలో నేతలు నిర్లక్ష్యంగా వ్యాఖ్యలు చేయొద్దని మోదీ వార్నింగ్ ఇచ్చారు. వివాదాస్పద విషయాలపై మౌనంగా ఉండాలని తెలిపారు. ప్రజా సమక్షంలో నాయకులు చేసే వ్యాఖ్యల్లో అణుకువ, బాధ్యత ఉండాలని హితవు పలికారు. ఎక్కడైనా, ఏదైనా మాట్లాడవచ్చు అనే ధోరణికి దూరంగా ఉండాలని, అనవసర వ్యాఖ్యలు పార్టీకి ప్రతికూలంగా మారతాయని హెచ్చరించారు.

ఇటీవలి కాలంలో మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాల బీజేపీ నాయకులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్'పై చేసిన వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించాయని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే విజయ్ షా కల్నల్ సోఫియా ఖురేషీపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. అలాగే మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం జగదీష్ దేవ్‌డా చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. 'యావత్తు దేశ ప్రజలు, జవాన్లు తలలు వంచి ప్రధాని మోదీ పాదాల వద్ద మోకరిల్లారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ జవాబిచ్చిన తీరును ప్రశంసించడానికి మాటలు చాలవు అని వ్యాఖ్యానించారు. ఇలా ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో తాజా, ఎన్డీయే సమావేశంలో బీజేపీ నేతలకు ప్రధాని మోదీ పై ఆదేశాలు జారీ చేశారు.

ఈ ఎన్డీయే సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌పై స్పష్టత ఇచ్చిన మోదీ.. కాల్పుల విరమణ ఒప్పందంలో దేశానిదే తుది నిర్ణయం. పాకిస్తాన్ విజ్ఞప్తి మేరకు సీజ్‌ఫైర్‌కు అంగీకరించాం. భారత్‌పాక్ కాల్పుల విరమణ ఒప్పందంలో మరే ఇతర దేశం జోక్యం చేసుకోలేదన్నారు.

# అనుష్క యాదవ్‌తో సన్నిహితంగా పెద్ద కుమారుడు..


## లాలూ ప్రసాద్ యాదవ్ సంచలన నిర్ణయం

పాట్నా: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కొద్ది సేపటి క్రితం తన పెద్ద కుమారుడు తేజ ప్రతాప్ యాదవ్‌ను ఆర్జేడీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు. తేజ్ ప్రతాప్‌ను ఆర్జేడీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. తేజ్ ప్రతాప్‌ను పార్టీ నుంచి బహిష్కరణకు కారణం శనివారం ఆయన ఫేస్‌బుక్‌లో ఓ పోస్టు పెట్టారు. ఆ సోషల్ మీడియా పోస్టే లాలూ కుటుంబంలో చిచ్చు పెట్టినట్లు తెలుస్తోంది. శనివారం తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో అకౌంట్‌లో ఓ పోస్టు ప్రత్యక్షమైంది. ఆ ఫొటోలో తేజ్ ప్రతాప్ ఓ యువతితో సన్నిహితంగా ఉన్నారు. ఆ యువతి పేరు అనుష్క యాదవ్ అని, తాము గత 12ఏళ్లుగా రిలేషన్‌లో ఉన్నట్లు ప్రకటించారు. ఆ పోస్టుపై దుమారం చెలరేగడంతో కొద్ది సేపటికే దానిని డిలీట్ చేశారు. తన ఫేస్‌బుక్‌ను ఎవరో హ్యాక్ చేశారన్నారు. ఆ పోస్టు తాను చేయలేదని స్పష్టం చేశారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం





జరిగింది. గతంలో, తేజ్ ప్రతాప్ యాదవ్, అనుష్క యాదవ్ సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలో వెలుగులోకి వచ్చాయి. దీంతో తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ ప్రకటనపై లాలూ ప్రసాద్ యాదవ్ మండిపడ్డారు. వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించడం, సామాజిక న్యాయం కోసం పార్టీ (ఆర్జేడీ) సమిష్టి పోరాటాన్ని బలహీన పరుస్తోంది. తేజ్ ప్రతాప్ ప్రవర్తన కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేవని ఎక్స్ వేదికగా అభిప్రాయం వ్యక్తం చేశారు. 'వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించడం, సామాజిక న్యాయం కోసం మన సమిష్టి పోరాటాన్ని బలహీన పరుస్తుంది. పెద్ద కుమారుడి కార్యకలాపాలు, ప్రజా ప్రవర్తన, బాధ్యతారహిత ప్రవర్తన మన కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేవు. అందువల్ల, పైన పేర్కొన్న పరిస్థితుల కారణంగా, నేను అతన్ని ఆరేళ్ల పార్టీ పార్టీతో పాటు కుటుంబం నుంచి బహిష్కరిస్తున్నాను. నేటి నుంచి పార్టీకి, కుటుంబంతో ఎలాంటి సంబంధం ఉండదు. ఆరేళ్ల పాటు పార్టీ నుండి బహిష్కరిస్తున్నాను' అని లాలూ యాదవ్ హిందీలో రాసిన పోస్ట్‌లో తెలిపారు. కాగా, తేజ్ ప్రతాప్ 2018లో బీహార్ మాజీ ముఖ్యమంత్రి దరోగా రాయ్ మనవరాలు ఐశ్వర్యను వివాహం చేసుకున్నారు. అయితే, వీరి మధ్య విభేదాలు రావడంతో ఐశ్వర్య ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.



# ఢిల్లీ షహదరాలో అగ్ని ప్రమాదం..

## ఈ-రిక్షా ఛార్జింగ్ స్టేషన్‌లో మంటలు

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని షహదరాలో అగ్ని ప్రమాదం జరిగింది. మోతీ రామ్ రోడ్డులోని ఈరిక్షా ఛార్జింగ్ స్టేషన్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. సంఘటన స్థలం నుంచి రెండు కాలిపోయిన మృతదేహాలను వెలికితీసినట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖ వెల్లడించింది. కాగా గత ఆదివారం.. ఓల్డ్ రాజేందర్‌నగర్‌లోని బడాబజార్ రోడ్డులోని కోచింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. నాలుగు, ఐదో అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు వ్యాపించినట్లు పోలీసులు తెలిపారు.

# తాజ్ మహల్‌కు బాంబు బెదిరింపు



**ఆగ్రా:** యూపీలోని ఆగ్రాలో గల తాజ్ మహల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్‌డీఎక్స్‌తో తాజ్‌మహల్‌ను పేల్చివేస్తామని కేరళ నుంచి ఈ మెయిల్ అందిన దరిమిలా సంబంధిత అధికారులు తాజ్ మహల్(Taj Mahal) వద్ద హై అలర్ట్ ప్రకటించారు. భద్రతా సంస్థలు అప్రమత్తమై, నిఘాను మరింత ముమ్మరం చేశాయి. బాంబు బెదిరింపు ఈ ఇమెయిల్ అందిన వెంటనే కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్), తాజ్ భద్రతా పోలీసులు, బాంబు నిర్వీర్య దళం, డాగ్ స్క్వాడ్, టూరిజం పోలీసులు, భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ)అధికారులు దాదాపు మూడు గంటల పాటు తాజ్ మహల్ ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. అయితే అనుమానాస్పద వస్తువులు ఏవీ కనిపించలేదు. తాజ్ మహల్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ, ఢిల్లీ పోలీసులకు(Delhi Police) గుర్తు తెలియని మెయిల్ ఐడి నుండి బెదిరింపు మెయిల్ అందింది. తాజ్ మహల్‌ను ఆర్‌డీఎక్స్‌తో పేల్చివేస్తామని దానిలో హెచ్చరించారు. ప్రాథమిక దర్యాప్తులో ఈమెయిల్ నకిలీదని తేలింది. దీనిపై సైబర్ సెల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది.

# 24 ఏళ్ల తర్వాత ఆ హీరో కోసం రీఎంట్రీ ఇస్తున్న బాలీవుడ్ బ్యూటీ

బాలీవుడ్ హీరోయిన్స్ ఇప్పుడు మెల్లిగా సౌత్ ఇండియా పరిశ్రమపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే బాలీవుడ్ టాప్ నటీనటులు ఇక్కడికి షిఫ్ట్ అయిపోతున్నారు. అయితే, 24ఏళ్ల క్రితమే కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ బ్యూటీ రవీనా టాండన్ . మళ్లీ తమిళ సినిమాపై ఆసక్తి చూపుతున్నారు. బాలీవుడ్‌లో హీరోయిన్‌గా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా సత్తా చాటారు. అంతేకాకుండా బెంగాలీ, కన్నడం, తెలుగు భాషల్లోనూ పలు చిత్రాల్లో కథానాయకిగా నటించారు. తమిళంలో అర్జున్‌కు జంటగా సాదు అనే చిత్రంతో 1994లో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత 2001లో కమలహాసన్‌కు జంటగా ఆళవందాన్ "అభయ్" చిత్రంలో నటించారు. కాగా ఇటీవల కాలంలో కన్నడ హీరో యష్ కథానాయకుడిగా నటించిన సూపర్ హిట్ చిత్రం కేజీఎఫ్ చాప్టర్ 2 చిత్రంలో ముఖ్య భూమికను పోషించారు. తెలుగులోనూ అడపా దడపా నటిస్తున్న రవీనా టాండన్ తాజాగా కోలీవుడ్ ప్రేక్షకులను మరోసారి పలకరించడానికి సిద్ధమవుతున్నారు. నటుడు, సాంకేత దర్శకుడు విజయ్ ఆంటోని ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉన్నారు. కాగా తాజాగా లాయర్ అనే చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి జాషువా సేతురామన్ కథ,దర్శకత్వం బాధ్యతలను నిర్వహించనున్నారు. కాగా విజయ్ ఆంటోనీ తన విజయ్ ఆంటోని ఫిలిం కార్పొరేషన్ పతాకంపై నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ జూన్ నెలలో ప్రారంభం కానుంది. ఇందులో విజయ్ ఆంటోనికి దీటైన పాత్రలో ఒక ప్రముఖ నటి నటించబోతున్నట్లు దర్శకుడు ఇదివరకే చెప్పారు. కాగా ఆమె ఎవరని చిత్ర వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఆమే నటి రవీనా టాండన్. దీని గురించి దర్శకుడు తెలుపుతూ నటి రవీనా టాండన్ 1999లో నటించిన శూల్ చిత్రంలో ఆమె నటన తనకు ఎంతగానో నచ్చిందన్నారు. అలాంటి నటి తమ చిత్రానికి అవసరం అనిపించిందన్నారు. లాయర్ చిత్రంలో రవీనా టాండన్ పాత్ర నటుడు విజయ్ ఆంటోని పాత్రకు దీటుగా ఉంటుందన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



# అందులో రొమాంటిక్ యాంగిల్ మాత్రమే చూశారు: భాగ్యశ్రీ బోర్సే

ఒకే ఒక్క తెలుగు సినిమాతో ప్రేక్షకుల్లో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే(Bhagyashri Borse). ఆ పాపులారిటీతోనే ఇప్పుడు చేతినిండా క్రేజీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటోంది. ఆ విషయాలే మీ కోసం.. నైజీరియాలోని లాగోస్‌లో భాగ్యశ్రీ బోర్సే చదువుకుంది. భారతదేశం తిరిగి వచ్చి ఆమె బిజినెస్ మేనేజ్మెంట్‌లో డిగ్రీలో చేరింది. ఆ సమయంలోనే మోడలింగ్ కెరీర్‌గా ఎంచుకుని ఒక ఏజెన్సీతో కలసిపనిచేసింది. పలు వ్యాపార బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరించింది. క్యాడ్‌బరీ డైరీ మిల్క్ సిల్క్ యాడ్‌తో ఆమె ప్రసిద్ధిచెందింది. విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'కింగ్‌డమ్' సినిమాలో నుంచి విడుదలైన 'హృదయం లోపల' సాంగ్ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఇందులో ఆమె చాలా ఇంటిమేట్‌గా కనిపించింది. ఈ విషయమై ఆమెను అడగ్గా, 'క్యారెక్టర్‌కి నూటికి నూరు శాతం న్యాయం చేయడానికే అలా నటించా- స్టార్‌డమ్ అందుకోవడానికి కాదు. ఇందులోని హీరోయిన్ పాత్రలో కేవలం రొమాంటిక్ యాంగిలే కాదు, యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. అందుకే, ఈ సినిమా కోసం నేను కూడా ఒక కామన్ ఆడియన్స్‌లాగా ఎదురు చూస్తున్నాను.' అని భాగ్యశ్రీ ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. రీసెంట్‌గా 26వ పుట్టినరోజు జరుపుకున్న భాగ్యశ్రీ.. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో జన్మించింది. భాగ్యశ్రీకి ఇద్దరు సిస్టర్స్ ఉన్నారు. ముగ్గురు ఆడపిల్లల్లో భాగ్యశ్రీ రెండవది. మిగిలిన ఇద్దరి పేర్లు మధువంతి, పూర్ణిమ. మొదటి సినిమాకి (మిస్టర్ బచ్చన్) రూ. 30 లక్షల పారితోషికం తీసుకున్న భాగ్యశ్రీ, ప్రస్తుతం రూ. రెండు కోట్లు డిమాండ్ చేస్తోందని సమాచారం. ఏ ఫుడ్ ఇష్టం: హైదరాబాద్‌లో స్ట్రీట్ ఫుడ్ అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా బేగం బజార్‌లో దొరికే పానీ పూరీ, చాట్ అంటే ప్రాణం. అవకాశం దొరికినప్పుడు తనే స్వయంగా వెళ్లి తినడానికి ప్రయత్నిస్తుంది.

**ఏ సినిమాలు చేస్తుంది:** రామ్ పోతినేనితో ఓ సినిమా, దుల్కర్ సల్మాన్‌తో ఓ సినిమా చేస్తోంది భాగ్యశ్రీ. 'కింగ్‌డమ్' సినిమా రిలీజ్ తర్వాతే కొత్త ప్రాజెక్టులు సైన్ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చిన ప్రతి సినిమాకు సైన్ చేయకుండా, ది బెస్ట్ అనిపించుకునే ప్రాజెక్టులకు మాత్రమే సైన్ చేస్తానంటోంది భాగ్యశ్రీ.

**బాలీవుడ్ ఆలోచనపై:** కెరీర్ ఆరంభంలో హిందీలో 'ఆరియాన్', 'చందు ఛాంపియన్' అనే రెండు సినిమాలు చేసింది. కానీ, ఆ రెండూ నిరాశనే మిగిల్చాయి. ప్రస్తుతానికి బాలీవుడ్ గురించి ఆలోచించడం లేదంది. బేసిక్‌గా వెజిటేరియన్ అయినా, ప్రొటీన్ కోసం చికెన్ తినడం అలవాటు చేసుకున్నట్లు చెప్పింది. రొమాంటిక్ సినిమాలు చూడటం చాలా ఇష్టమట. ఏ పని అయినా వందశాతం చేయగలను అనే నమ్మకం ఉంటేనే, ఆ పనిని టేకప్ చేస్తాను. లేకపోతే నో చెప్పేస్తా' అని చెప్పింది భాగ్యశ్రీ.



# నాగార్జున-ధనుశ్ మూవీ..

## ట్రాన్స్ ఆఫ్ కుబేర వచ్చేసింది!



నాగార్జున, ధనుశ్ కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం కుబేర. ఈ మూవీకి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కానుంది. ఈ మూవీని అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి శ్రీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే విడుదల కావాల్సిన సినిమా పలు కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర బృందం టీజర్‌ను విడుదల చేసింది. ట్రాన్స్ ఆఫ్ కుబేర పేరుతో టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను మెప్పించాయి. హీరో ధనుష్ కుబేరలో సరికొత్త పాత్రలో కనిపించనున్నాడు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా జూన్ 20న థియేటర్లలో సందడి చేయనుంది.

## క్రీడా వార్తలు | SPORTS NEWS



# సీఎస్‌కే ఆల్‌రౌండ్ షో..

## కీలక మ్యాచ్‌లో గుజరాత్ చిత్తు

ఐపీఎల్2025 సీజన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ అద్భుతమైన విజయంతో ముగించింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 83 పరుగుల తేడాతో సీఎస్‌కే చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో చెన్నై జట్టు ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 230 పరుగుల భారీ స్కోర్ సాధించింది. సీఎస్‌కే ఇన్నింగ్స్‌లో డెవాల్డ్ బ్రెవిస్(23 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 57), డెవాన్ కాన్వే(35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52) సూపర్ హాఫ్ సెంచరీలతో చెలరేగగా.. ఆయూష్ మాత్రే(17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34), ఉర్విల్ పటేల్(19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు పడగొట్టగా.. సాయికిషోర్, రషీద్ ఖాన్, షారుఖ్ ఖాన్ తలా వికెట్ సాధించారు.

### సుదర్శన్ ఒక్కడే..

అనంతరం లక్ష్య చేధనలో సీఎస్‌కే బౌలర్లు చెలరేగడంతో గుజరాత్.. 18.3 ఓవర్లలో 147 పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ బ్యాటర్లలో ఓపెనర్ సాయిసుదర్శన్(41) టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ 13 పరుగులు చేయగా.. స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ కేవలం 5 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచారు. సీఎస్‌కే బౌలర్లలో అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్ తలా మూడు వికెట్లు పడగొట్టి గుజరాత్‌ను దెబ్బతీయగా.. రవీంద్ర జడేజా రెండు, పతిరానా, ఖాలీల్ అహ్మద్ చెరో వికెట్ పడగొట్టారు. కాగా ఈ ఓటమితో గుజరాత్ టైటాన్స్ టాప్2 స్థానం ప్రమాదంలో పడింది. ఆర్సీబీ, పంజాబ్ తమ తదుపరి రెండు మ్యాచ్‌లలో గెలిస్తే గుజరాత్ మూడో స్థానానికి పడిపోతుంది.

# కోల్‌కతాపై సన్‌రైజర్స్ గ్రాండ్ విక్టరీ



ఐపీఎల్2025 సీజన్ తమ ఆఖరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా ఆదివారం అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 110 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 278 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో హెన్రిచ్ క్లాసెన్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. క్లాసెన్ 39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లతో 105 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. క్లాసెన్‌తో పాటు ట్రావిస్ హెడ్(40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76), అభిషేక్ శర్మ(16 బంతుల్లో 32), ఇషాన్(29) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. కేకేఆర్ బౌలర్లలో సునీల్ నరైన్ రెండు, వైభవ్ ఆరోరా ఓ వికెట్ సాధించారు. అనంతరం లక్ష్య చేధనలో కేకేఆర్ 18.4 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌటైంది. కేకేఆర్ బ్యాటర్లలో మనీశ్ పాండే(37) టాప్ స్కోరర్‌గా నిలవగా.. హర్షిత్ రాణా(34), సునీల్ నరైన్(31) పర్వాలేదనిపించారు. మిగితా కేకేఆర్ బ్యాటర్లంతా విఫలమయ్యారు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో జయ్‌దేవ్ ఉనద్కట్, మలింగ మూడు వికెట్లు పడగొట్టగా.. హర్ష్‌దూబే తలా రెండు వికెట్లు సాధించారు.

## హెన్రిచ్ క్లాసెన్ విధ్వంసం

### 37 బంతుల్లో సెంచరీ



ఐపీఎల్-2025లో అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ అద్భుత సెంచరీతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన క్లాసెన్ విధ్వంసం సృష్టించాడు. ఈ దక్షిణాఫ్రికా ఆటగాడు ప్రత్యర్థి బౌలర్లను ఊతికారేశాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో సిక్సర్ల వర్షం కురిపించాడు. అతడి బ్యాటింగ్ ధాటికి ఫీల్డర్లు కేవలం ప్రేక్షక పాత్ర మాత్రమే పోషించారు. ఈ క్రమంలో క్లాసెన్ కేవలం 37 బంతుల్లోనే తన రెండో ఐపీఎల్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. క్లాసెన్ ఓవరాల్‌గా 39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లతో 105 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. దీంతో టాస్ గెలిచిన తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 278 పరుగుల భారీ స్కోర్ సాధించింది. క్లాసెన్‌తో పాటు ట్రావిస్ హెడ్(40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76), అభిషేక్ శర్మ(16 బంతుల్లో 32), ఇషాన్(29) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. కేకేఆర్ బౌలర్లలో సునీల్ నరైన్ రెండు, వైభవ్ ఆరోరా ఓ వికెట్ సాధించారు. కాగా ఇది ఐపీఎల్‌లో మూడో అత్యధిక స్కోర్ కావడం విశేషం.

# ప్లే ఆఫ్స్‌కు ముందు పంజాబ్ కింగ్స్‌కు భారీ షాక్

ఐపీఎల్2025 సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు ముందు పంజాబ్ కింగ్స్‌కు భారీ షాక్ తగిలింది. స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ గాయపడ్డాడు. ఈ విషయాన్ని పంజాబ్ కింగ్స్ అసిస్టెంట్ కోచ్ సునీల్ జోషి ధ్రువీకరించాడు. అయితే చాహల్ ఏ గాయంతో బాధపడుతున్నాడన్న విషయాన్ని జోషి స్పష్టం చేయలేదు. గాయం కారణంగానే శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌కు చాహల్ దూరమయ్యాడు. చాహల్ స్థానంలో ప్రవీణ్ దూబే జట్టులోకి వచ్చాడు. కేవలం ఒక్క వికెట్ మాత్రమే పడగొట్టిన దూబే.. భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. "చాహల్ చిన్న గాయంతో బాధపడుతున్నాడు. అందుకే అతడికి మేము విశ్రాంతి. అతడు మా తదుపరి మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నాము" అని పోస్ట్ మ్యాచ్ కాన్ఫరెన్స్‌లో సునీల్ జోషీ పేర్కొన్నాడు. ఒకవేళ చాహల్ గాయం కారణంగా మిగిలిన మ్యాచ్‌లకు దూరమైతే పంజాబ్‌కు అది గట్టి ఎదురు దెబ్బే అని చెప్పాలి. ఎందుకంటే ఈ సీజన్‌లో చాహల్ పంజాబ్ జట్టుకు ప్రధాన స్పిన్నర్‌గా ఉన్నాడు. ఓ హ్యాటిక్ కూడా అతడి ఖాతాలో ఉంది. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడిన చాహల్.. 9.56 ఏకానమితో 14 వికెట్లు పడగొట్టాడు. కాగా పంజాబ్ కింగ్స్ పాయింట్ల పట్టికలో టాప్2 స్థానం కోసం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు ఆర్హత సాధించిన పంజాబ్‌కు ఇంకా ఒక లీగ్ మ్యాచ్ మిగిలి ఉంది. మే 26న జైపూర్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో పంజాబ్ తలపడనుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com